# శిల్పాలేఔట్ ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయాలి

**-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశం**


ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్‌రావు తదితరులు

**హైదరాబాద్, మే 3,(ప్రభాతవార్త):** గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్పలేఔట్ రెండో దశ పనులను మే నెల చివరి వరకు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు తో కలిసి కమిషనర్ మల్కం చెరువు, గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు చేపట్టే శిల్పాలే ఔట్ రెండో దశ పనులను కమిషనర్ పరిశీలించారు. మల్కం చెరువు వద్ద శానిటేషన్, కుక్కల బెడద పై వాకర్స్ ఫిర్యాదు చేయడంతో వెంటనే నిర్వాహకులతో మాట్లాడి వాకర్స్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్ చెరువులోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖాజాగూడ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా హెచ్.సిటీ ద్వారా చేపట్టే ఫ్లైఓవర్, అండర్ పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు మూడు వరుసల బై డైరెక్షన్ శిల్పాలే ఔట్ ఫ్లైఓవర్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ ఫ్లై ఓవర్ వలన చేరవలసిన గమ్యస్థానానికి ఎన్ని నిమిషాల్లో వెళ్తారని కమీషనర్ అధికారులను వివరణ కోరగా ఓఆర్ఆర్ నుండి కొండాపూర్ కు, కొండాపూర్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు హైటెక్ సిటీకి వెళ్లేందుకు సులభతరం అవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు కమిషనర్ కు వివరించారు. ఫ్లైఓవర్ పూర్తవ్వడానికి ఎంత కాలం పడుతుందని ఇంజనీరింగ్ అధికారులను అడుగగా ఫ్లైఓవర్ పైన బిటి, ఎల్ ఈ డి లైట్ల పనులు కొనసాగుతున్నాయని, సర్వీస్ రోడ్డు పనులు సుమారు 5 ఆస్తుల భూసేకరణ ప్రక్రియ పూర్తయితే 15 రోజుల్లో పూర్తవుతుందని ఇంజనీర్లు తెలపడంతో ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అక్కడే ఉన్న జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ ఎస్.ఈ శంకర్ నాయక్, డిసి ప్రశాంతి, ప్రాజెక్టు ఈఈ నమ్యా నాయక్, డిప్యూటీ ఈఈ హరీష్, యుబిడి డైరెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ వార్త



# అరె..అచ్చం అలాగే..

# నమ్మితే నట్టేటా మోసమే..!

**☛ సూపర్ మార్కెట్, కిరాణ దుకాణాల్లో నకిలీ ఉత్పత్తుల రాజ్యం**

**☛ నగర టాస్క్‌ఫోర్స్‌పోలీసుల తనిఖీల్లో అరకొర వెలుగుచూస్తున్న వైనం**

**హైదరాబాద్,మే3, ప్రభాతవార్తః** కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు వ్యాపారులు, వాణిజ్యవేత్తలు ఎంతకైనా తెగిస్తున్నారు. నమ్మకమే పెట్టుబడిగా పెడుతూ నిలువుగా మోసగిస్తున్నారు. అక్కడక్కడ సూపర్ మార్కెట్లు, చిన్నపాటి కిరాణా దుకాణాళ్లు సైతం దోపిడియే ప్రధాన లక్ష్యంగా అమాయకులను బలిస్తున్నారు. ఆయా రాష్ట్రాలు, జిల్లాలతో పాటు పాతబస్తీలో విషపు రసాయనాలు, రంగులతో కలిపిన ఆహార పదార్థాలు ప్రముఖ బ్రాండ్లతో తయారు చేసి అతిచవక ధరలకు డిస్ట్రిబ్యూటర్లకు సరఫరా చేస్తున్నారు. ఇక దుకాణదారులు మార్కెట్ ధరలకు విక్రయాలు జరుపుతూ అధిక రాబడి పొందుతున్నారు కేటుగాళ్లు. వరుస ఫిర్యాదుల నేపథ్యంలో ఇటీవల నగరవ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముకుమ్మడి దాడులతో భయంకర వాస్తవాలు వెలుగుచూశాయి. నవశిశువులు తినే పాలపౌడర్ కూడా కల్తీ అని తెలియడంతో విస్తుపోయారు. ఏళ్ల నుంచి జరుగుతున్న నకిలీ దందాపై తెలియని దుస్థితి.

**రసాయనాలు, రంగులే పెట్టుబడులు..**

పొరుగు రాష్ట్రాలు, ఆయా జిల్లాలు, నగరంలోని పాతబస్తీ నకిలీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలు. ఇక్కడ నుంచే నకిలీ ఆహార పదార్థాలను విషపు రసాయనాలు, రంగులతో కృతిమంగా అచ్చం వాస్తవానికి తీసిపోకుండా సిద్ధం చేసి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తున్నారు.పుట్టిన శిశువుల పౌడర్ల నుంచి అన్ని రకాల ఆహార పదార్థాలను పంపిణి చేపడుతూ జనాల అనారోగ్యంతో ఆడుకుంటున్నారు. ముఖ్యంగా కారంలో ఎర్రటి ఇటుకల పౌడర్లు,పసుపులో పసుపు రంగులతో ఎండుగడ్డి పౌడర్, కొబ్బరనూనెను చీప్ ఆయిల్స్‌తో నింపడం, పప్పు దినుసులన్ని ప్లాస్టిక్‌తో ఇలా ఎన్నో వాటిని కూడా నకిలీగా తయారు చేస్తున్నారు. పంటలతో వచ్చే సహజ పదార్థాలు ఎంతో రుచిని ఇస్తాయి. కానీ కల్పిత వస్తువులు ఆరోగ్యాన్ని క్షిణింపజేస్తాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. దీన్ని అరికట్టకపోతే భవిష్యత్తు మరింత ప్రమాదంగా మారుతుందని హెచ్చరిస్తున్నారు.

**పాతబస్తీ వ్యాపారం.. కోటీశ్వరులే..**



పాతబస్తీ పెట్టుబడి అంత మాములు కాదనేది బహిరంగ రహస్యం. ఎక్కడ నుంచి వచ్చిన అక్రమాలకు కేంద్రబిందువు. నకిలీ ఉత్పత్తులు కూడా అక్కడి నుంచి రాష్ట్రవ్యాప్తంగా తరలివెళ్తున్నాయి. సాధారణంగా రూ.10ల వస్తువు కొనుగోలు చేస్తే మార్కెట్‌కు వచ్చే వరకు రూ. వందకు పైబడే ధరలు ఉంటాయి. అంత చవకగా దొరకడం..ఊహకు అందని లాభాలు ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారస్తులు పెద్ద మొత్తంలో సరుకును కొనుగోలు చేస్తున్నారు. కానీ ఎంతవరకు నాణ్యమైన సరుకు అనేది చూడడం లేదు. అసలు వస్తువులనే పోలి ఉండడంతో గుర్తించలేకపోతున్నారు. ఏమైన పోలీసులు ల్యాబ్‌టెస్టింగ్‌లతో నిర్ధారణ చేయడంతో నకిలీ అని తెలడంతో కొందరు లబోదిబో అంటున్నారు. మరికొందరూ ఇదే లాభాల పంట అని నకిలలనే అసలుగా విక్రయిస్తూ నిరుపేద, మద్యతరగతి ప్రజల గొంతుకోస్తున్నారు. ఇక పెద్దపెద్ద సూపర్‌మార్కెట్లో కూడా ఇవే రాజ్యమేలుతుందంటే ఎంతగా మోసాలకు పాల్పడుతున్నారో తెలిసిపోతుంది. సబ్బులు, వంటనూనెలు, ఆయా రకాల పిండిలు, గసాలు, ఆవాలు, ఇలాచీలు, కారం, నూడుల్ ఇలా ఒక్కటేంటి ఎన్నో ఆహారపదార్థాల్లో కల్తీ రాజ్యమేలుతోంది.

**అధికారులు ఏం చేస్తున్నారు?**

నకిలీ ఉత్పత్తులు బహిరంగ మార్కెట్లోకి వస్తున్నాయంటే జీహెచ్ఎంసీ, పోలీసులు నిఘా వైఫల్యం ఉందనేది తెలుస్తోంది. ఉత్తత్తుల తయారీకేంద్రాలు, విక్రయాలపై ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలే లేవు. ఎప్పుడో ఒకసారి ప్రభుత్వం లెక్కల కోసం మొక్కుబడి చర్యలు చేపట్టడమే కాకుండా ఆమ్యామ్యాలతో రాజీ కుదుర్చుకుంటున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రాజకీయ నేతల అండదండలతోనే నకిలీ ఉత్పత్తుల తయారీదారులు మరింతగా రెచ్చిపోతున్నారనే విమర్శలు లేకపోలేదు. అప్పుడప్పుడు పోలీసులకు ఫిర్యాదులు రావడంతో హాడవిడి చేస్తూ దాడులు చేయడం పరిపాటిగా మారింది. ఆ తర్వాత ఘటనపై కన్నెత్తి చూడని దుస్థితి. అడ్డా మార్చారా?.. సదరు అక్రమార్కులు మరెమైన పేర్లతో కలాపాలు సాగిస్తున్నారనే విషయాలు తెలుసుకోకలేకపోతున్నారు. దీంతో జనసంచారం లేని పాతబంగ్లాలాంటి భవంతుల్లో అక్రమార్కులు మళ్లీ ఏర్పాటు చేసి దందాలు కొనసాగిస్తున్నారు. ఒకసారి పట్టుబడితే మరోసారి వారే ఉండకూడదూ.. అసలే దందాలే మూతపడాలనే లాజిక్కులు పోలీసులు మరిచినట్టున్నారు. మళ్లీ అవే నకిలీ దందాలు పుట్టుకొస్తున్నాయంటే ఎన్నో అనుమానాలు రేకెత్తించగా మానదు.

# అందరూ సన్నం బియంతో భోజనం చేయాలి : మంత్రి పొన్నం


రేషన్‌షాప్‌లో సన్నబియాన్ని పంపిణి చేస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త:** ధనవంతులు, పేదలు అనే బేదం లేకుండా అందరూ సన్నబియ్యంతో భోజనం చేయాలనే ఉద్దేశంతో దేశంలో తొలిసారిగా సన్న బియ్యంతో భోజనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఉగాది పండువ నుంచి సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎన్నికల కోడ్ ఉన్నందున సన్నబియాన్ని పంపిణి చేయలేకపోయామని, ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో ఈ నెల 1వ తేదీ నుంచి సన్నబియాన్ని పంపిణి చేస్తున్నామని ఆయన చెప్పారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఒక రేషన్‌షాప్‌లో సన్నబియం పథకాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం సమీపంలోని గాంధీకుటీర్‌లో సన్నబియం లబ్ధిదారుడి నివాసంలో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, కార్పోరేటర్లు మహాలక్ష్మీరామన్‌గౌడ్, విజయారెడ్డి కూడా పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొన్నాల మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియాన్ని పంపిణి చేస్తున్నామని, 653 రేషన్ షాప్‌లలో ఈ సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళ పాలనలో ప్రజలను పట్టించుకోలేదని, కనీసం రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు చేయలేకపోయిందని, ఎంఆర్ఓ కార్యాలయం ద్వారా రెగ్యులర్‌గా వచ్చే అప్లికేషన్ల ద్వారా రేషన్‌కార్డులు పంపిణి చేయడం జరుగుతుందన్నారు. బయట షాపులలో కిలో బియ్యం 60 రూపాయల వరకు ఉందని, పేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతున్నదని చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల గురించి మంత్రి వివరించారు.

## నృత్యరూపక ప్రదర్శనతో గురుసత్కారం అద్భుతం

**-రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి**



శ్రీవల్లీశర్మను పురస్కారంతో సత్కరిస్తున్న జస్టిస్ జి.రాధారాణి, ఓలేటి, రఘురామ్, ఉషాగాయత్రి తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 3 ప్రభాతవార్త :** తమ గురువు జన్మదిన సందర్భంగా శిష్యబృదం నృత్యరూపకంతో గురుసత్కారం చేయడం అద్భుతమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి అన్నారు. పౌరాణిక ప్రబంధ సాహిత్యాల్లోని ముఖ్యసంఘటనలు ప్రోదిచేసి కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత నాట్యగురువు డా. ఉషాగాయత్రి ఆరువసంతాల నాట్యారాధనను పురస్కరించుకొని వందలాది ఆమె శిష్యులు రసరసమ్యం, మనోహర నేత్రపర్వంగా మాతృదేవోభవ కూచిపూడి నృత్యరూపకంతో గురుసత్కారం కావించారు. నృత్యకిన్నెర ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. ఓలేటి పార్వతీశం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి విశిష్ట అతిథులు డా. అలేఖ్య పుంజాల, సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్, పాపారావు, నాట్యగురువు మద్దాళి ఉషాగాయత్రి తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి ముందుగా డా. మద్దాళి ఉషాగాయత్రి తల్లిదండ్రుల పురస్కారాన్ని ప్రముఖ గాయని శ్రీవలీశర్మను ఘనంగా సత్కరించి బహూకరించి ప్రసంగించారు. నాట్యశిక్షణతో క్రమశిక్షణ, ఏకాగ్రత, సంపూర్ణ ఆరోగ్యం, మనోవికాసం, చైతన్యం వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. గురు ఉషాగాయత్రి 6దశాబ్దాలుగా నాట్యకళకే అంకితమై తాను నేర్చుకున్న కూచిపూడి నృత్యకళను వందలాది ఔత్సాహికులకు నేర్పించి గొప్ప కళాకారులుగా తీర్చిదిద్దడానికి చేసిన కళాసేవ అద్భుతం, అనితరసాధ్యం, స్ఫూర్తిదాయకమని కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. అనంతరం గురుశిష్య పరంపరగా, గొప్ప సంప్రదాయానికి నిదర్శనంగా, ఆమెచే రూపొందింపబడిన మాతృదేవోభవ కూచిపూడి నృత్యరూపకంతో శిష్యబృందం ఆహుతులను అబ్బురపరిచి అలరించారు.

## ఎటిఎంల వద్ద ఖాతాదారులను మోసం చేస్తున్న ముఠా రిమాండ్

**కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్త :** బ్యాంకు సెలవు రోజును ఎంచుకుని, భద్రత సిబ్బంది లేని ఏటిఎం లను లక్ష్యంగా చేసుకుని కొత్త తరహా దొంగతనాలకు తెరలేపిన అంతరాష్ట్ర దొంగలను తిరుమలగిరి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుండి 70 వేల రూపాయల నగదు తో పాటు చోరీకి వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు తిరుమలగిరి ఏసిపి రమేష్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అతిక్ అహ్మద్, మహమ్మద్ డానిష్‌లు వృత్తిరీత్యా డ్రైవర్లుగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వీరు ముంబైలో నివాసం ఉంటున్నట్లు ముంబైలో కూడా ఈ తరహా దొంగతనా లకు ప్రణాళిక రచించినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 27న ఆర్టిఏ కార్యాలయం సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఉన్న ఏటీఎంలో నగదు ఉపసంహరణ కోసం వచ్చే వినియోగదారులను తప్పుదోవ పట్టించి నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం లలో నగదు ఉపసంహరణ చేసే సమయంలో డిస్పెన్సర్‌కు టేపు అతికించి డబ్బులు రాకుండా ఇరుక్కుపోయేలా చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం ఏటీఎం నుండి డబ్బులు రావడంలేదని వినియోగదారులు అక్కడినుండి వెళ్లిన వెంటనే టేపును తొలగించి డబ్బులు తీసుకున్నట్లు సిసి కెమెరాల ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. వినియోగదారులకు తమ ఖాతాల నుండి డబ్బులు డ్రా చేసినట్లు సందేశాలు రావడంతో బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్యాంక్ అధికారులు తిరుమలగిరి పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేయగా సిసి కెమెరాలను పరిశీలించడంతో ఒకేరోజు 12 సార్లు దొంగతనం జరిగిన పోలీసులు గుర్తించారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులకు, వినియోగదారులకు పోలీసులు సూచించారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మిస్ కెనాడా మిస్ ఎమ్మాడినా కాథరిన్ మోరిసన్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

## అక్రమ నిర్మాణాల కూల్చివేత..

**జీడిమెట్ల, మే 3, ప్రభాతవార్త** గాజులరామారంలోని సర్వే నెంబర్ 79/1 లో గల ప్రభుత్వ స్థలంను 2009 లో రాజీవ్ స్వగృహ ఇళ్ల నిర్మాణాల కోసం రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్‌కు కేటాయించారు. అయితే అప్పటి కాంగ్రెస్ హయాంలో కేటాయించిన ఈ స్థలంలో కొన్ని బ్లాక్స్‌తో కూడిన అపార్ట్మెంట్ సముదాయాలు ఏర్పాటు చేయగా 2014 తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం పర్యవేక్షణ లేకుండా మిగతా ఖాళీ స్థలాలు వదిలేశారు. స్థలాలు కబ్జాదారులకు వరంగా మారాయి. గత పదేళ్ల కాలంలో చాలా వరకు ఈ స్థలాలు అన్యాక్రాంతం కాగా, ప్రస్తుతం మరికొన్ని నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈ స్థలాలలో వెలసిన అక్రమ నిర్మాణాలను శనివారం రెవెన్యూ, హౌసింగ్ బోర్డు శాఖల సమన్వయంతో పోలీస్ సిబ్బంది సహకారంతో కూల్చివేశారు. రెండు రేకుల షెడ్స్, రెండు గదులు, మరొక్క స్లాబ్‌తో కూడిన ఇంటి నిర్మాణాన్ని అధికారులు కూల్చివేశారు. ఇది హౌసింగ్ బోర్డుకు కేటాయించిన స్థలం అని కబ్జాదారులు శిక్షార్హులని కూల్చివేతల అనంతరం హౌసింగ్ బోర్డు సిబ్బంది ప్రభుత్వ సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కూల్చివేతలలో కుత్బుల్లాపూర్ మండలం ఆర్ఐ కలీం, హౌసింగ్ బోర్డు ఏఈ నందకుమార్ పాల్గొన్నారు.

## సెక్షన్ అధికారిపై కార్పొరేటర్ దాడి

**- పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు**


జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

**జియాగూడ,మే 3ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని జాంబాగ్ డివిజన్ బిజెపి కార్పొరేటర్‌రాకేష్‌జైస్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ 14 టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారిపై దాడి చేశాడు.దాడి చేసిన కార్పొరేటర్‌రాకేష్‌జైస్వాల్‌పై టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారి నరేష్ అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలోఉన్న సెక్షన్ అధికారిపై దాడి చేసిన కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ బిఎన్ఎస్ యాక్ట్ 132,352 కింద కేసు నమోదుచేసినట్లు అబిడ్స్ పోలీసులు తెలిపారు.ఉద్యోగి విధులకు అటంకం కలిగించి దాడికి పాల్పడ్డారని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.ఈ ఘటనపై జిహెచ్ఎంసి కమీషనర్ కర్ణన్ స్పందించి అధికారులపై దాడులు చేస్తే సహించబోమోమన్నారు.అధికారులను పిలిచి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసినట్లు అబిడ్స్ పోలీసులు కమీషనర్ వివరించినట్లు తెలిపారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**అత్తాపూర్ మే3, ప్రభాతవార్త :** నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం రాజేంద్రనగర్ డివిజన్ సర్వ రెడ్డి జాక్షన్, శివరాం పల్లి వద్ద రూ 15.80 తో సీసీ రోడ్డు పనులు, ఉప్పర్ పల్లిలో రూ 10.50 తో అయ్యప్ప స్వామి టెంపుల్‌కు అప్రూచ్ రోడ్డు పనులు,38 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను కార్పొరేటర్ అర్చన జయప్రకాష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# 5న అంబర్‌పేట ఫ్లై ఓవర్‌ను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి గడ్కరీ

**-సర్వీస్ రోడ్ల నిర్లక్ష్యంపై అధికారులపై మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**


అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్లను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


అంబర్‌పేట ఫ్లైఓవర్ కింద గార్డెనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త** అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.415 కోట్ల వ్యయంతో నిర్మించిన అంబర్‌పేట్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం మే 5న జరగనున్న సందర్భంగా శనివారం ఉదయం అంబర్‌పేట ఫ్లైఓవర్ పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు.ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులపై ఆయన అధికారులపై మండిపడ్డారు.ఫ్లైఓవర్ కింద జరగాల్సిన రోడ్ల విస్తరణ, ఫౌంటేషన్, గ్రీనరీ డెవలప్ మెంట్ వంటి అభివృద్ధి పనులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు.ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తైనప్పటికీ, దాని కింద భాగంలో ప్లాంటేషన్, గ్రీనరీ అభివృద్ధి, సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి కీలక పనులు పూర్తికాకపోవడాన్ని మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు.అధికారులపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.ఈ సందర్భంగా నేషనల్ హైవేస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కృష్ణప్రసాద్, ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజినీర్ ధర్మారెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, అడిషనల్ డీసీపీ నర్సయ్యలపై కిషన్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భూ సేకరణ బాధ్యతను మోస్తున్న జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు.ఎంక్రోచ్‌మెంట్ నియంత్రణపై అసంతృప్తివ్యక్తం చేశారు.ఫ్లైఓవర్ కింద పార్కింగ్ ఏర్పాటు చేసినప్పటికీ, ప్లాంటేషన్ లేకపోవడం, గ్రీనరీ అభివృద్ధి జరగకపోవడం, అలాగే అది ఎంక్రోచ్ కాకుండా జాలీ ఏర్పాటు చేయాల్సిన పనులు పూర్తికాకపోవడం పై కేంద్రమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మతపరమైన నిర్మాణాల కారణంగా అడ్డంకులు ఉన్నట్లు చెబుతున్నప్పటికీ, వాస్తవంగా అక్కడ అలాంటి సమస్యలు లేవని స్థానికులు తెలిపారు. దీంతో అధికారుల నిర్లక్ష్యం,పోలీసు యంత్రాంగం రక్షణ కల్పించడంలో వైఫల్యం చెందడాన్ని తప్పుబట్టారు.ఫ్లైఓవర్ కింది భాగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి, ప్రజలు, ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. “నిధులు ఇచ్చిన తర్వాత పనిచేయకపోతే ప్రజలకు సమాధానం చెప్పేది ఎవరు?“ అనే ప్రశ్నను అధికారుల ముందుంచారు. తక్షణమే పెండింగ్ పనులను పూర్తిచేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.అధికారులు రాత్రికి రాత్రే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేస్తామని సమాధానం చెప్పినప్పటికీ, ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ ముహూర్తం దగ్గరపడటంతో అప్పటికప్పుడే పనులను పూర్తి చేయడం సాధ్యమవుతుందా అనే అయోమయంలో పడిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమంలో నితీన్ గడ్కరీ పాల్గొంటారని తెలిపారు. కొంత మందిపై ఫ్లై ఓవర్‌ను ఆపే పని చేశారని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇంటి స్థలం సేకరించిన తర్వాత ఒక రాజకీయ పార్టీ అడ్డుపడే ప్రయత్నం చేసిందన్నారు. ఇంకా 6 చోట్ల భూసేకరణ పూర్తికాలేదని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, జిహెచ్ఎంసికి లేఖ రాసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ హయాంలోనే అంబర్‌పేట ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన జరిగినట్లుగా గుర్తుచేశారు. గ్రేవ్ యార్డు కారణం గా రోడ్డు విస్తరణ చేయలేక ఫ్లైఓవర్ నిర్మాణం మంజూరు చేయించినట్లు తెలిపారు. ఫ్లైఓవర్ ప్రజలకు ఎందగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

## రాష్ట్రానికి కావాల్సింది అందాల పోటీలు కాదు, విద్యార్థులకు నాణ్యమైన విద్య

**సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త:** రాష్ట్రానికి కావాల్సింది అందాల పోటీలు కాదని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర బిసి యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అందాల పోటీలకు సుమారు 200 కోట్లకుపైగా ఖర్చు అవుతున్నదని, వచ్చే ఆదాయం ఏమి ఉండదని, ఆ డబ్బులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ పెండింగ్‌లో ఉన్న ఫీజుల రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, లక్ష మంది విద్యార్థులకు మెస్ చార్జీలు, ఎస్సీ,ఎస్టీ, బిసి విద్యార్థుల హాస్టల్స్ భవనాల నిర్మాణానికి కొంత మేరకు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం యూనివర్సిటిలో ఉంటున్న విద్యార్థుల పరిశోధనలకు ప్రోత్సహించే విధంగా ఫెలో స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణ రచయిత పుస్తకాల ముద్రణకు ఆర్థిక సహాయం

**- రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు**

**నాంపల్లి, మే 3 ప్రభాతవార్త :** తెలంగాణ తెలుగు రచయితలకు తమ రచనలను ముద్రించుకోవడానికి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం అందించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, కళలు, చరిత్ర, సంస్కృతికి సంబంధించిన సృజనాత్మక, పరిశోధనాత్మక, విమర్శనాత్మక రచనల్ని ఆర్థిక సహాయం కోసం పంపవచ్చు. దరఖాస్తును విశ్వవిద్యాలయంలోని విస్తరణ సేవావిభాగం నుండి పొందవచ్చు. లేదా విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్శిటీ.ఏసి.ఇన్ నుండి కూడా పొందవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తును పూర్తిచేసి ఏదేని ముద్రణా సంస్థ నుండి పొందిన ఒక కొటేషన్‌ను తీసుకొని దరఖాస్తుకు జతపరచాలి. దరఖాస్తును 31-5-2025వ తేదీలోగా ఇన్‌చార్జ్, విస్తరణ సేవావిభాగం, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, పరిపాలనా భవనం, సాయినగర్, బాచుపల్లి ప్రాంగణం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ-500118 చిరునామాకు పంపాలని తెలిపారు.

### లక్ష్యాల సాధనకు అంకితభావంతో ముందుకు సాగాలి



కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ కస్తూరి, హరిత కస్తూరి తదితరులు

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:** లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరు అంకితభావం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని వక్తలు పేర్కొన్నారు. పేస్ ఐఐటి, మెడికల్ వార్షికోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆ సంస్థ డైరెక్టర్ శంకర్ కస్తూరి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్‌లు హరిత కస్తూరి, చరిత దిట్టకవి తదితరులు పాల్గొన్నారు. తమ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్,కెమిస్ట్రీ, బయోలజీ వంటి సబెక్టుల లో బలమైన పునాటికి సహాయపడుతుందన్నారు. తమ సంస్థలో పనిచేసే బోధనా సిబ్బంది అనుబవజ్ఞులు అని, ఆన్‌లైన్ ద్వారా తరగతులు అందుబాటులో ఉంటాయన్నారు. కాగా తమకు రాష్ట్రవ్యాప్తంగా నిత్యా రెండవ, జె.వైష్ణవి మూడవ ర్యాంక్, ఏరోబా అహ్మద్ ఖురేషీ, ఎ.కుషాల్, ఎం.ఆదిత్య ప్రతీక్ మంచి ర్యాంకులు సాధించినట్లు వివరించారు.

### నేడు ఇందిరాపార్కు నుంచి అబేడ్కర్ విగ్రహం వరకు పీస్ ర్యాలీ

**హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త:**

ప్రపంచం మొత్తం సోదర భావంతో ఉండాలని భోధించేదే భౌద్ధమతమని, దానికి ఆది అయిన బుద్ధ భగవానుడి పవిత్ర క్షేత్రమైన బౌద్ధ గయలో ప్రస్తుత పరిస్థితులు ఆందోళన రేకెత్తిస్తున్నాయని, శాంతిని కోరుతూ నేడు పీస్ ర్యాలీ ని ఇందిరా పార్క్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహిస్తున్నట్లు భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ శాఖ రాష్ట్ర కార్యదర్శి జి. రాజేశ్వరరావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ ధరంపాల్, నల్లా సూర్య ప్రకాష్, పరంధాములు, చింతోజీ లతో కలిసి ఆయన మాట్లాడుతూ బౌద్ధమతం స్వీకరించిన వారికి పవిత్ర క్షేత్రమైన బౌద్ధ గయలో మహాబోధి మహావిహార్‌లో ప్రస్తుతం బ్రాహ్మణ పూజారుల ఆధిపత్యం పెరిగిపోయిందన్నారు. బౌద్ధుల ఆధ్యాత్మిక,సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ప్రభుత్వం తక్షణమే బుద్ధ గయ ఆలయ చట్టాన్ని రద్దు చెయ్యాలని, స్వతంత్రంగా వ్యవహరించే బౌద్ధ నిర్వహణ ట్రస్ట్ ను ఏర్పాటు చెయ్యాలని ఆయన కోరారు. శాంతిని కోరుతూ నేడు ఇందిరా పార్క్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పీస్ ర్యాలీని వందలాది మందితో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### పాదయాత్రలో సమస్యలను తెలుసుకున్న కార్పొరేటర్



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**పురానాపూల్,మే 3ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకుగాను నిరంతరం కృషి చేయడం జరుగుతుందని పురానాపూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తెలిపారు. శనివారం డివిజన్‌పరిధిలోని దూద్‌బౌలి తదితర బస్తీల్లో ఆయన స్థానిక ప్రజలతో కలిసి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అందుకు ముఖ్యంగా సివరేజ్,వర్షంనీటి కాలువలను మరమ్మత్తులను చేయించాలని స్థానిక ప్రజలుకార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ విన్నవించారు.అందుకు ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్,శాసనసభ్యులు జుల్ఫకర్ అలీ నిధులతో పెరుగుతున్న జనాభా అనుగుణంగా పనులను చేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లీస్ నాయకలు కె.శ్రీనివాస్, హబీబ్ ఖురేషీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకుంటున్న వేసవి శిబిరాలు

**కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వైఎంసీఏలో జరుగుతున్న వేసవి శిభిరాల్లో చిన్నారులు సందడి చేస్తున్నారు. గత నెల 26వ తేదీన ప్రారంభమైన ఈ వేసవి శిభిరాల్లో పెద్ద ఎత్తున చిన్నారులు పాల్గొని తమ అభిరుచికి అనుగుణంగా వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. క్రీడలు, వివిధ రకాల కళలు, సంగీతం, లైఫ్ స్కిల్స్ లాంటి 24 అంశాల్లో శిక్షణ అందిస్తుండటంతో వేసవి శిభిరాలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైఎంసీఏలో శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. బాస్కెట్ బాల్, చెస్, బాడీ ఫిట్నెస్, షటిల్ బాడ్మింటన్, జిమ్నాస్టిక్, ఎయిరోబిక్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, కాలిగ్రఫి, కర్సివ్ రైటింగ్, కీబోర్డ్, గిటార్, వయోలిన్, హిపాప్ అండ్ బోయింగ్, ఫోక్ డ్యాన్స్, భరతనాట్యం, తేక్వాండో, కుంగ్‌ఫూ, అబాకస్, స్కేటింగ్, పర్సనాలిటీ డెవలప్మెంట్, ఫ్యాషన్ అండ్ మోడలింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, పబ్లిక్ స్పీకింగ్, యోగా, పేరెంట్ కాంపిటేషన్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలతో కాలక్షేపం చేయకుండా ఇలాంటి క్రీడలు, కళల్లో శిక్షణ పొందడం వల్ల వారి శారీరక పటిష్టత, మానసిక ఉల్లాసం దొరుకుతుందని వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్ తెలిపారు. ఇటీవల కాలంలో పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత లేకుండా పోయిందని కనీసం వేసవి సెలవుల్లో అయినా చిన్నారులకు దీన్ని అందించాలని ఆయన సూచించారు.

## తెలంగాణ సినిమాలకే గద్దరన్న అవార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రఫుల్ రాంరెడ్డి

**సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త:** తెలంగాణ సినిమాలకే ప్రజా గాయకుడు గద్దర్ పేరు మీద అవార్డులు ఇవ్వాలని, ఫలిం ఛాంబర్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ సినిమా వేదిక (టిసివి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేని పక్షంలో తామే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని వేదిక నాయకులు తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టియూ జెఏసి సెక్రటరీ జనరల్ తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, టిసివి కన్వీనర్ లారా, కో-కన్వీనర్ మోహన్‌బైరాగి మాట్లాడుతూ తెలంగాణలో సినిమాల అభివృద్ధియే లక్ష్యంగా తాము టిసివిని ఆవిర్భవించడం జరిగిందని, కేవలం తెలంగాణ సినిమాలకే గద్దర్‌న్న అవార్డులు ఇవ్వాలని, ఆంధ్ర సినిమాలకు గద్దరన్న అవార్డులను ప్రకటిస్తే తాము అడ్డుకుంటామని హెచ్చరించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెలంగాణ సినిమా పాలసీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సినిమా రంగం, జానపద కళా రంగం వెనుకబడి ఉందని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ యువతకు సినిమాల్లో అవకాశాలు రాకపోవడంతో నిరాశ, నిస్పృహాలతో జూబ్లీహిల్స్‌లో రోడ్ల వెంట తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సినిమా కళాకారులకు ప్రభుత్వ పెన్షన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

## త్యాగరాజ స్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద :ఉప్పల శ్రీనివాస్ గుప్త



కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:**

కర్ణాటక శాస్త్రీయ సంగీతానికి దిశా నిర్దేశనం చేసిన ఆది వాగ్గేయకారులు త్యాగరాజ స్వామి అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళావి ఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా వాగ్గేయకారుడు. త్యాగరాజ స్వామి జయంతి సభ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాజ కీర్తనలు సంగీతం పాళ్ళు ఎక్కువ అని వివరించారు.అన్నమాచార్య కీర్తనల్లో సాహిత్యం పాలు ఎక్కువ కాగా త్యాగరాజ స్వామి కీర్తనలు సంగీత బద్ధం అనీ, స్వర జ్ఞానం వున్నవారే వాటిని ఆలపించగలరని రాజుల ఆశ్రయం చేరక బిక్షాటన చేస్తూ నిధి చాలా సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా అని శ్రీ రాముని నమ్ముకుని అపారమైన సంగీత సంపద జాతి కి అందించిన త్యాగజీవి త్యాగరాజు అని నివాళి అర్పించారు. త్యాగరాజ కీర్తనలు అజరామరం గా శతాబ్దాలు గడిచినా నిలిచి వుండటానికి కారణం గురు పరంపర సంప్రదాయం అని పేర్కొన్నారు. త్యాగరాజ స్వామి కీర్తనలు తెలుగు భాషా సంపద అని అన్నారు. త్యాగరాజ కీర్తనలు ప్రతి గుడి లోనూ వినిపించాలని అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో బి జె పి నాయకుడు వంశీ గాన సభ కార్యవర్గ సభ్యులు బండి శ్రీనివాస్ ద్రవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థలు

**-విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు**

**-రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు**

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థలు ప్రమాదంలో ఉన్నాయనీ, వాటి విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాజ్యాంగ హక్కుల పదిరక్షలు వేసిక ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గవర్నర్ల పాత్ర న్యాయస్థానాలు భారత రాజ్యాంగం అంశంపై సదస్సు జరిగింది. దీనికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శనరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ల వ్యవస్థను తెలుగుదేశం పార్టీతో పాటు ద్రవిడ రాజకీయ పార్టీలన్నీ వ్యతిరేకించాయని తెలిపారు. వట్టసభలు చట్టాలు చేస్తే. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్, శాసనమండలి చైర్మెన్లు ఆమోదిస్తే సరిపోతుందనీ, దానికోసం గవర్నర్ల వ్యవస్థ ఎందుకనేది వారి ప్రశ్న అని చెప్పారు. అయితే చట్టసభలు రాజ్యాంగానికి లోబడే చట్టాలు చేయాలనీ, దానిలో ఏదైనా లోపాలు ఉంటే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకొని, సరిచేయడం లేదా తిరస్కరించడం చేస్తుందని వివరించారు. ఎస్ఆర్ బొమ్మై కేసులో ఇదే జరిగిందని గుర్తుచేశారు. అన్ని వ్యవస్థలకు రాజ్యాంగమే సుప్రీం అనీ, అయితే రాజ్యాంగంలో న్యాయసమీక్షకు ప్రత్యేకంగా ఎలాంటి వ్యవస్థ లేదని చెప్పాడు. న్యాయస్థానాలు స్వీయ హద్దులు నిర్ణయించుకొని ఆ బాధ్యతల్ని నిర్వహిస్తున్నాయని వివరించారు.దేశంలో తటస్థంగా వ్యవహరిస్తున్న వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు కొన్ని రాజకీయశక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నాలుగో స్తంభం అని చెప్పబడే మీడియాను నయానో, భయానో తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారనీ, ఇప్పుడు వారి దృష్టి రాజ్యాంగం, న్యాయవ్యవస్థలపై ఉన్నదని వివరించారు. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల అనర్హత అంకాలు స్పీకర్ పరిధిలో ఉన్నా దానికి నిర్ణీత గడువు లేదనీ, దాన్ని న్యాయవ్యవస్థ నిర్ణయిస్తే భరించలేని స్థితి ఉన్నదని చెప్పాడు. రాజ్యాంగం మౌలిక స్వరూపం మార్చే ఉద్దేశ్యం అధికారంలో ఉన్నవారికి ఉన్నదనీ, దానికోసం ఆయా వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని స్పష్టం చేశారు. సదస్సుకు తెలంగాణ హైకోర్టు సీనియర్ ఆర్యకేట్ జీ విద్యాసాగర్ అధ్యక్షత వహించారు.

## తెలుగు భాష దెబ్బ తినడాన్ని తెలుగు సమాజం సహించదు

**-మాతృభాషతోనే అవగాహన పెరుగుతుంది**

**: పూర్వ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి**



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి డాక్టర్ నందిని సిధారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:** తెలుగు భాష దెబ్బ తినడాన్ని తెలుగు సమాజం సహించబోదని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి బి. సుదర్శన్ రెడ్డి అన్నారు. మాతృభాషతోనే అన్ని సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగుభాషాభిమానులు తెలంగాణ ఆధ్వర్యంలో సనాలోచన సభజరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృతం బాగా ప్రచుర్యంలోకి రావడం సాధారణ విషయంగా భావించవద్దన్నారు. మాతృభాషను సమాజం నుంచి దూరం చేస్తే ఆ సమాజం ఆలోచించే శక్తిని కోల్పోతుంది అన్నారు. ఒక తెలుగు సమాజంలో తప్ప ఏ రాష్ట్రంలో మాతృభాషకు హాని జరిగే విధానం లేదన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా సంస్కృతాన్ని వ్యతిరేకించింది బుద్ధుడేనని అన్నారు. ఆనాటి ప్రజల భాష అయినా పాలిలో తన భోదనలను సాగించారని చెప్పారు. ఇంగ్లీషు ప్రపంచ భాష ఎలా అయ్యిందని ప్రశ్నించారు. ప్రపంచ భాష అనుకోవడం పొరపాటే అని ప్రపంచంలో పెద్ద దేశాలైన చైనా, రష్యా, యూరప్ దేశాలు ఎవరికి వారు వారివారి సొంత భాషలు పెద్ద దేశాలైన చైనా, రష్యా, యూరప్ దేశాలు ఎవరికి వారు వారివారి సొంత భాషలు ఉన్నాయని అన్నారు. యూఎస్ఏ, ఇంగ్లాండ్, ఇండియాలో తప్ప ఏ దేశంలో కూడా ఇంగ్లీష్ని ఎక్కువగా వాడారు అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజలు తమ కష్టాన్ని తమ భాషలోనే చెప్పుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, తెలంగాణలోని పాత ఓరియంటల్ (తెలుగు ) కళాశాలలను పునరుద్ధరించాలని సురవరం ప్రతాప్రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తెలుగు కళాశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలో ప్రభుత్వ పండిత శిక్షణ కళాశాలలను ఏర్పాటు చేయాలని ఒకటో తరగతి నుంచి డీగ్రీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో తెలుగును తప్పనిసరి చేస్తు ఉత్తర్వులు ఇవ్వాలని తదితర 11 డిమాండ్లతో తీర్మానం చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, మోతుకూరు నరహరి, డాక్టర్ డి. చంద్రశేఖర్ రెడ్డి, అల్లం నారాయణ, పిల్లల మర్రి రాములు, కె. శ్రీనివాస్, కవి యాకుబ్, ఎం. రాఘవాచారి, డాక్టర్ సిల్మానాయక్, వెల్దండి శ్రీధర్, ప్రొఫెసర్ కమలాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

## 20న సమ్మెలోకి భవన నిర్మాణ కార్మికులు



కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్ అసోసియేషన్ అయింట్ ప్లాట్ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు మరియు అనుబంధ రంగాల కార్మికులులంతా ఈ సమ్మెలో పాల్గొంటారని తెలియజేస్తూ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ సమ్మె నోటీస్‌ను ఆ శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్‌కు శనివారం అందించారు. శనివారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, సిఐటియు, టిఎన్‌టియుసి, బిఎన్ఆర్‌కెఎస్, ఎస్‌బిఎన్‌కెఎస్, ఐఎఫ్‌టియు, జిహెచ్‌సిసిఎ, బిఆర్‌టియుకు చెందిన ప్రతినిధులు ఈ మేరకు లేఖను అందించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, భవన నిర్మాణ కేంద్ర చట్టం 1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం 1979, కాంట్రాక్ట్ కార్మికుల చట్టం 1970 లను పకడ్బందీగా అమలు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26,000/లు ఇవ్వాలని, కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించడంతో పాటు. బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖరు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారా ఖర్చు, ప్రసూతి, నివాహ కానుకలను రూ. లక్షకు పెంచాలని, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి. కేంద్ర చట్టంలోని స్కాలర్షిప్లు, గృహవసతి అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, 2009లో నమోదు చేసుకున్న కార్మికుల సంక్షేమ బోర్డు కార్డులు వెంటనే రెన్యువల్ చేయాలని, ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందించాలని,. కార్మికులకు నష్టపరిహారాన్ని ఇవ్వాలిలని, ఆరోగ్య పరీక్షల పేరుతో రూ.442 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారు. వెంటనే సిప్సీ టెస్టులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

## మృదుమధురంగా సాగిన మువ్వల సవ్వడి

**-నాలుగు నాట్యరూపాల్లో 150 మందికిపైగా కళాకారుల ప్రదర్శనలు**

**-ఉదయం నుంచి సాయంత్రం వరకు నృత్యాలు**



మువ్వల సవ్వడి కార్యక్రమంలో కళాకారుల ప్రదర్శనలు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త**

ఒకవైపు కూచిపూడి.. మరోవైపు కథక్.. కొందరేమో భరతనాట్యం.. మరికొందరు ఆంధ్రనాట్యం.. ఇలా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రశస్తి చెందిన నృత్యరూపాలన్నీ ఒక్కచోట కొలువుదీరాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 20 అకాడమీలకు చెందిన 150 మందికి పైగా నృత్య కళాకారిణులు, కళాకారులు వీటన్నింటినీ అద్భుతంగా ప్రదర్శించారు. వీటన్నింటికీ బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్‌లోని సెస్ ఆడిటోరియం వేదికైంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మువ్వలసవ్వడి ప్రతిధ్వనించింది. సాంస్కృతిక కళారూపాలకు, భారతీయ సంప్రదాయ నృత్యానికి పెద్దపీట వేసే మహోన్నత లక్ష్యంతో ఏర్పాటుచేసిన అమృత కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినోద్ అగర్వాల్, కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఇంతమంది కళాకారులను ఒక్క చోటకు తీసుకురావడం, ఇన్ని రకాల కళారూపాలను ఒకే వేదికపై ప్రదర్శింపజేయడం ద్వారా అందరినీ అలరించడంతో పాటు.. నాట్యకళకు తిరిగి ప్రాణం పోశారని నిర్వాహకులైన అమృత కల్చరల్ ట్రస్టును వారు ప్రశంసించారు. సాయంత్రం నిర్వహించిన అవార్డుల బహూకరణ కార్యక్రమంలో ముందుగా న్యాయ నిర్ణేతలు శిరూషా అమర్, పద్మ దెందులూరి, వనశ్రీ ప్రొద్దుటూరు, వీణా గణేశ్, సునీలా గొల్లపూడి, సుష్మా ఉదయ్ మహంతి, చైతన్య కుసుమప్రియ.. తాము ఏయే అంశాల ఆధారంగా విజేతలను నిర్ణయించామో చెప్పారు. కళాకారులు ఒకరికి మించి మరొకరు తమ హావభావాలు, ముద్రలు, నృత్య కౌశలంతో వేదికపై అద్భుతాలు సృష్టించారని వారు ప్రశంసించారు. ముద్ర, అభియనం, బృంద స్ఫూర్తి, ప్రేక్షకుల నుంచి స్పందన, వస్త్రాలంకరణ, డిజిటల్ స్పాట్‌లైట్ లాంటి విభాగాలలో పలువురికి అవార్డులు అందించారు. ట్రస్టు వ్యవస్థాపకులు రాజేష్ పగడాల, భార్గవి పగడాల మాట్లాడుతూ,'ప్రతియేటా నాట్యతోరణం పేరుతో ఒక వార్షిక నృత్య పండుగ నిర్వహిస్తున్నాం. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న.. వివిధ నృత్యరీతులకు చెందిన పలువురు లబ్ధప్రతిష్ఠులైన కళాకారులు పాల్గొంటారు. ఇది కళలు సంస్కృతి, సంప్రదాయాల ఉత్సవంలా ఉంటుంది. ఇప్పుడు నిర్వహించిన మువ్వల సవ్వడి కార్యక్రమం కూడా.. దేశంలోని అన్ని కళారీతులకు ప్రాతినిధ్యం వహించింది. మువ్వల సవ్వడి కార్యక్రమం ద్వారా హైదరాబాద్ నగరాన్ని శాస్త్రీయ నృత్యానికి ప్రధాన కేంద్రంగా చేయాలని భావిస్తున్నాం. ఇక్కడ చేసే ప్రతి ప్రదర్శన భారతీయ సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిధ్వనిస్తుంది" అని తెలిపారు.

**పాల్గొన్న అకాడమీలు ఇవీ..**

నృత్యాంజలి కూచిపూడి నాట్యాలయం, లహరిశ్రీ నృత్యనికేతన్, నాట్య సంధ్య కూచిపూడి నృత్య అకాడమీ, ఎస్‌కేఎం ఫైన్ ఆర్ట్స్ అకాడమీ, తరంగిణి కథక్ కేంద్ర, శ్రీ రాధికా సంగీత, నృత్య అకాడమీ, నిశ్శంకల నృత్య అకాడమీ, రింద శరణ్య కూచిపూడి నృత్య అకాడమీ, శ్రీదేవి నాట్యాలయ, యోగిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, కళా నృత్యనికేతన్, శారదా కళాక్షేత్ర, భావనాస్ కూచిపూడి నృత్య అకాడమీ, నృత్యజ్యోతి డాన్స్ స్కూల్, శాంకరి కూచిపూడి నృత్య, సంగీత అకాడమీ, సుమేధసెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, కళాభూమి, శ్రీ చైతన్య కూచిపూడి కళాక్షేత్రం, నృత్యకిన్నెర, ద టెంపుల్ డాన్స్, సమన్వయ డాన్స్ కంపెనీల నుంచి 143 మంది నృత్య కళాకారులు ఇందులో పాల్గొని తమ నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు.

## టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారినంటూ బెదిరింపు

**-16ఐపీఎల్ టికెట్లు,రూ1700నగదు తీసుకుని కారులో పరార్**

**-ఆలస్యంగా గ్రహించి బేగంపేట పోలీసులకు యువకులు ఫిర్యాదు**



,సూడో పోలీసు అధికారి ప్రయాణించిన కారు.

**బేగంపేట మే 3,ప్రభాతవార్త**

నాకు ఐపీఎల్ టికెట్లు కావాలి.మీకు ఎక్కువ డబ్బులు ఇస్తాను నాకు ఇవ్వండి అంటూ యువకులను మాటల్లోకి దింపి ఆ తర్వాత వారి వద్ద నుంచి టికెట్లు తీసుకుని తాను టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారినంటూ మీ వద్ద ఐపీఎల్ టికెట్లు ఎక్కడ నుంచి వచ్చాయి.మీరు బ్లాక్ టికెట్లు అమ్ముతున్నారా,మిమ్మల్ని పట్టుకునేందుకే వచ్చా రండి పోలీసు స్టేషన్‌కి వెళ్తాం అంటూ యువకులను బెదిరించి వారి వద్ద నుంచి 16ఐపీఎల్ టికెట్లు,రూ 1700నగదు తీసుకుని ఉడాయించిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసారు.పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం,పుట్టపాక గ్రామానికి చెందిన వంగూరి రాకేష్ ఈ నెల 5వ తేదీన నగరంలో జరగనున్న ఎస్ ఆర్ హెచ్,డీసీ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ చూసేందుకు 16టికెట్లను కొనుగోలు చేసేందుకు అతని స్నేహితులైన జి.పవన్,రామకృష్ణతో కల్సి నగరానికి వచ్చారు.మొదట హిమాయత్ నగర్‌లోని టికెట్ బుకింగ్ కేంద్రానికి వెళ్లి టికెట్ల కోసం ప్రయత్నించగా అక్కడ 8టికెట్లు మాత్రమే లభించాయి. మిగిలిన 8టికెట్ల కోసం సికింద్రాబాద్ జింఖానా మైదానం వద్దకు వచ్చారు.అక్కడ వారు 8టికెట్లను కొనుగోలు చేసి బయటకు వస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వారిని అడ్డగించాడు.తనకు నాలుగు టికెట్లు విక్రయించాలని రూ 2500లు చొప్పున విలువ చేసే టికెట్లకు రూ 5000లు ఇస్తానని వారిని మాటల్లోకి దించాడు.ముందు తాము ఇవ్వమని చెప్పినా అతను పదే పదే వారిని ఒత్తిడి చేయడంతో టికెట్లు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు.మళ్లీ అదే వ్యక్తి మరో 6టికెట్లు కూడా కావాలని అడిగాడు.టికెట్లు ఇచ్చేందుకు యువకులు నిరాకరించడంతో వారిని బెదిరించాడు.తాను పోలీసు నంటూ ఐడెంటిటీ కార్డు చూపించాడు.తాను టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారినని,బ్లాకులో టికెట్లు విక్రయిస్తున్నారని వారిని బెదిరించాడు.అందరినీ జైలుకు పంపుతానంటూ భయపెట్టి అందరినీ బేగంపేట పోలీసు స్టేషన్ వద్దకు తీసుకు వచ్చాడు .మొత్తం 16ఐపీఎల్ టికెట్లను లాక్కుని యువకుల వద్ద రూ 1700లు కూడా తీసుకుని తిరిగి బాధితులను పరేడ్ గ్రౌండ్స్ వద్ద దించి వెళ్లిపోయాడు.దీంతో అనుమానం వచ్చిన యువకులు బేగంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్హెచ్ఆర్. జయచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయడాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు : ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, చలసాని శ్రీనివాస్,

**చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త:** దేశంలో హైదరాబాద్ను రెండో రాజధానిగా చేయాల్సిందేనని దీన్ని ఏ శక్తి అడ్డుకోలేదని దక్షణాది జాయింట్ యాక్షన్ కమిటి చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్కుమార్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దక్షిణాది జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గాలి వినోద్కుమార్ మాట్లాడుతూ రెండో రాజధాని గురించి ప్రస్తావించింది అంబేద్కరేనని ఒకవేళ హైదరాబాద్ను దేశ రాజధానిగా చేయాడాన్ని అడ్డుకుంటే అంబేద్కర్ను వ్యతిరేకించినట్లేనని అన్నారు. తెలంగాణకు చెందిన హైదరాబాద్ రాజధాని అయితే బడ్జెట్ పెరగడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై మాట్లాడవద్దా అన్నారు. దక్షిణాది గురించి మాట్లాడితే దేశ ద్రోహం కేసు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాదికి రెండో రాజధాని అడగడం నేరం కాదని ఇది రాజ్యాంగ పరమైన హక్కు అన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ అమలు చేయకపోవడం భాదకరం అన్నారు. నీళ్ల నిధులు, నియమకాలు ఎవరి చేతుల్లో ఉన్నాయని ప్రశ్నించారు. దక్షిణాదిలో కోట్లాది రూపాయల వ్యాపారం ఉత్తరాది వాళ్లతోనే నడుస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సలహాదారులు చలసాని శ్రీనివాస్, నల్లా సూర్యప్రకాష్, ప్రొఫెసర్ ఏ. తిరుపతి, దండి వెంకట్, జిలుకర శ్రీనివాస్, మచ్చ దేవేందర్, పి. శంకర్, షకిల్, గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.

### విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలం



ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న ధర్మేంద్ర

**సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త:** యువతకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించడంలో పాలకులు విఫలం చెందారని, మతఛాందస విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధరేంద్ర చెప్పారు. ఎఐవైఎఫ్ అవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణభవన్ ఎదుట యువజన సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమాధికారాన్ని కాపాడుకుందామని యువత ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసింది. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర ప్రధానమైనదని, యువతరంలో ప్రగతిశీల, అభ్యుదయ భావాలను, దేశభక్తి, లౌకిక ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని నేర్పించడానికి తమ సంఘం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ఆర్.బాలకృష్ణ, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### పార్కులలో పనులు త్వరగా ప్రారంభించాలి : శ్రీనివాస్ రెడ్డి



పార్కుల స్థలాలను సందర్శిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి,

**మైలార్‌దేవ్‌పల్లి,మే 3 ప్రభాతవార్త :**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సారధి యూత్ క్లబ్ జిహెచ్ఎంసి పార్కు,టిఎన్‌జిఓఎస్ కాలనీలో పార్కు సుందరీకరణ పనులలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి శనివారం హార్టికల్చర్ సిబ్బందితో కలిసి పార్కుల స్థలాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు పార్కులలో పుట్‌పాత్,ఆహ్లాదకరమైన మొక్కలు,నీటి సౌకర్యం ఉండేలా పనులు వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఓహెడ్ అధికారి అధికారి,సారధి యూత్ క్లబ్ సభ్యులు,స్థానిక బస్తీ నాయకులు బుచ్చిరెడ్డి,సుమ రెడ్డి,శ్రీ కాంత్ రెడ్డి,ఎల్వీ రెడ్డి,అనిల్ రెడ్డి,పాండు యాదవ్,సుధాకర్,శశిధర్ రెడ్డి,సాయి శంకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,రమేష్ రెడ్డి,సురేష్,అభి,సుమంత్‌లు పాల్గొన్నారు.

### విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు : ఖలీల్ ఉర్ రెహ్మాన్



కార్యక్రమంలో పాల్గొన్న న్యూమోడల్ విద్యా సంస్థల చైర్మన్ మహ్మద్ ఖలీల్ ఉర్ రెహ్మాన్, డైరెక్టర్ జియా ఉల్ రెహ్మాన్

**చార్మినార్,మే 3 ప్రభాతవార్త :** విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని న్యూమోడల్ విద్యా సంస్థల చైర్మన్ ఖలీల్ ఉర్ రెహ్మాన్ అన్నారు.హుస్సేనీఆలంలోని న్యూమోడల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎస్‌సి పరీక్షలో 569 మార్కులు సాధించిన విద్యార్థి షేక్ ఆసిఫ్ ఇస్లాంతో పాటు ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించారు.పాతబస్తీలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం న్యూ మోడల్ విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో న్యూ మోడల్ విద్యా సంస్థల డైరెక్టర్లు ఫజల్ ఉల్ రెహ్మాన్,జియాఉల్ రెహ్మాన్, తెలుగు ఉపాధ్యాయులు మాజిద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పోలీసులు సీజ్ చేసిన వాహనాలకు వేలం

**హైదరాబాద్, మే3, ప్రభాతవార్తః**

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న పలు రకాల వాహనాలను బహిరంగ వేలం వేయాలని ప్రతిపాదించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆయా కంపెనీల సదరు వాహనాలు అంబర్‌పేటలోని పోలీస్ మైదానంలో ఉన్నాయని వివరించారు. సదరు బాధిత వాహనాల యజమానులు, రుణగ్రహీతలు ఆరునెలల్లోపు దరఖాస్తులు సమర్పించి క్లెయిమ్ చేసుకోవాలని వివరించారు. లేనియెడల వాహనాలను వేలానికి తరలించనున్నట్లు వెల్లడించారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : గాంధీ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న గాంధీ

**వివేకానంద నగర్ కాలనీ, మే 3, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా మనం చేస్తుందని పీఏసీ చైర్మన్ ఆర్కెపూడి గాంధీ అన్నారు. శనివారం వివేకానంద నగర్ కాలనీలోని ఆయన కార్యాలయం వద్ద కూకట్పల్లి మండలం పరిధిలోని వివేకానంద నగర్ కాలనీ, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, కూకట్పల్లి పార్ట్ డివిజన్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టడం గొప్ప విషయమని అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, సంజీవరెడ్డి, ప్రసాద్, దొడ్ల రామకృష్ణ గౌడ్, శ్రీధర్ రెడ్డి, అష్రాఫ్, బాల నర్సయ్య, అక్కిరెడ్డి ,నిఖిల్ లబ్ధిదారులు మహిళలు పాల్గొన్నారు.

### జెఎన్‌టి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వృద్ధి 2025


వృద్ధి 2025 కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**కెపిహెచ్బి కాలనీ, మే 3 ప్రభాతవార్త:** జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్టీయూహెచ్)కు చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్ వారు మే 2, 3వ తేదీలలో వార్షిక మేనేజ్‌మెంట్ ఫెస్ట్ వృద్ధి 2025ను విశ్వవిద్యాలయం పరిధిలోని యుజిసి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెఎన్టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫెస్ట్‌లో జెఎన్టీయూహెచ్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన అనేక కళాశాలల విద్యార్థులు అధికారిక, అనధికారిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమల నుంచి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరిలో డా. పి. రత్నాకర్, ప్రెసిడెంట్ – హెల్త్‌కేర్, ఇన్నోమైండ్స్ ఇంక్, డా. త్రివిక్రమ్, ప్రతినిధి – డెలాయిట్, ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త కవితా రాజేష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకొని, ప్రస్తుత మార్కెట్ ధోరణులు, పరిశ్రమలోని అవకాశాలు, లీడర్‌షిప్ నైపుణ్యాలపై విలువైన సూచనలు అందించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డా. సింధు, సంతోష్ కుమారి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వృద్ధి 2025 విద్యార్థులకు పరిశ్రమ నిపుణులతో ప్రత్యక్ష పరస్పర చర్య కోసం మేలైన వేదికగా నిలిచి, వారి మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అభివృద్ధి పరచడంలో విశేష పాత్ర పోషించింది.

## పిల్లల్లో క్రమశిక్షణకు విబిఎస్ సమ్మర్ క్యాంపు ఉపయోగం


ర్యాలీలో పాల్గొన్న ఊట్ల చంద్ర రెడ్డి

**కెపిహెచ్బి కాలనీ, మే 3 ప్రభాతవార్త:** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్లోని ఫిలడెల్ఫియా ప్రార్థన మందిరంలో పది రోజులపాటు వి.బి.ఎస్, సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన ర్యాలీలో పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డి పాల్గొన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, మంచి క్రమశిక్షణ, మంచి అలవాట్లు, దేవుని యందు భక్తి, తల్లిదండ్రులకు విధేయత, సమాజానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చేటువంటి విద్యార్థులుగా మంచి క్రమం నేర్చుకోవడానికి విబిఎస్ ఎంతగానో ఉపయోగపడుతుందని పిల్లలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘకాపరి పాస్టర్ సల్మాన్, నాయకులు తెట్టెబావి ఆనంద్, సంఘపెద్దలు ఇజ్రాయిల్, రాజ్ కుమార్, బాలకృష్ణారెడ్డి, ప్రసంగి, ప్రేమయ్య, దయాకర్, కోర్నేలు, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## ఫలితాల సాధనలో పట్టుసాధించిన యూనిక్ హైస్కూల్


ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బోకేలు ఇచ్చి సత్కరిస్తున్న చింతల్ యూనిక్‌హైస్కూల్ కరస్పాండెంట్ పి. శివయ్య, ప్రిన్సిపల్ నాగభూషణంలు

**కుత్బుల్లాపూర్, మే 3 ప్రభాతవార్త :** విద్యార్థులు అన్నిరంగాలలో సమర్థవంతంగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని యూనిక్‌హైస్కూల్ కరస్పాండెంట్ పి. శివయ్య అన్నారు. యూనిక్‌హైస్కూల్ విద్యార్థులు పదవతరగతి ఫలితాలలో సత్తాచాటిన సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ నాగభూషణంతో కలిసి విద్యార్థులను సత్కరంచారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతల్‌తోపాటు కుత్బుల్లాపూర్ సర్కిల్‌పరిధిలోనే యూనిక్‌హైస్కూల్ ఫలితాల సాధనలో మొదటనుండి ముందువరసలో నిలిచిందన్నారు. తమ యూనిక్‌హైస్కూల్‌లో పరీక్షా ఫలితాలతోపాటు క్రీడలు, సాంస్కృతిక, విద్యా, వికాసపోటీలలో తమ వద్యార్థులు సత్తాచాటుతున్నారని తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో తమ యూనిక్ హైస్కూల్ విద్యార్థులు కె.రిషిక588/600, సాగర్‌కుమార్ 586/600, నాగ సత్యలక్ష్మిపూజ 581/600 సాధించి సత్తాచాటారని తెలిపారు.ప్రిన్సిపల్ నాగభూషణం మాట్లాడుతూ 43మంది విద్యార్థులకు 550 నుండి 580మార్కులు, 52 మంది విద్యార్థులు 500నుండి 550 మార్కులు సాధించారని, 500 మార్కులు పైబడినవారు 98మంది సాధించారని, 99శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

## వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధవహించాలిః ఎమ్మెల్యే శ్రీగణేష్


ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్తః** ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గంగపుత్ర సంఘం, బొల్లారం ఆధ్వర్యంలో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్‌ల సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మానవ సేవే మాధవ సేవ అని, అన్ని కులాలు అన్ని మతాల కన్నా మానవత్వమే గొప్పదని, పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన గంగపుత్ర సంఘం ప్రతినిధులను, పరీక్షలు నిర్వహించిన హాస్పిటల్స్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో కిమ్స్ హాస్పిటల్ నుండి జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్ డాక్టర్ లు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. సాయి జ్యోతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో బోర్డు మాజీ సభ్యుడు జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నరసింహమూర్తి, జీ.శోభారాణి, నర్సింగ్ రావు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, గంగపుత్ర సంఘం బొల్లారం అధ్యక్షుడు పూస యోగేశ్వర్, సలహాదారుడు నరహరి, ఉపాధ్యక్షుడు పి. వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పి.ఎన్.జైరాజ్, సురేష్, పూర్ణచందర్, ఉమా మహేశ్వరి, విజయలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కాలనీలో స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని వినతి


మేనేజర్ కే.పవన్ కుమార్‌కి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ కాలనీ సభ్యులు

**నిజాంపేట్, మే 3, ప్రభాతవార్త** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్, కే పవన్ కుమార్‌కి జర్నలిస్ట్ కాలనీలో స్పీడ్ బ్రేకర్‌ల విషయమై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి నిజాంపేట ప్రధాన రహదారి నుంచి జర్నలిస్ట్ కాలనీ మీదుగా బాచుపల్లి, గండిమైసమ్మ రహదారి వైపు రాకపోకలు విపరీతంగా పెరిగాయి. సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీ, గవర్నమెంట్ మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలు, కార్పొరేట్ స్కూల్స్, కార్యాలయాలు, డబుల్ బెడ్రూమ్ ఇళ్లతో పాటు లెక్కకు మిక్కిలిగా ఈ రహదారిలో అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు వెలిశాయి. ఈ నేపథ్యంలో ఈ రహదారిలో వెళ్లే వాహనాల వేగానికి అంతులేకుండాపోతుంది. కాలనీవాసులు రోడ్డు దాటాలంటే హడలెత్తిపోతున్నారు. రోడ్డు కిరువైపులా నివాసాలతో పాటు శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం కూడా ఉంది. వివిధ అవసరాల కోసం రోడ్డుకు అటూ ఇటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రోడ్డు మీదకు వచ్చే చిన్నారులకు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో పలుమార్లు ప్రమాదాలు కూడా జరగడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో వాహనాల వేగానికి కళ్లెం వేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేలా ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటుచేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్య శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్తః** కంటోన్మెంట్ వార్డు 4 గాంధీ కాలనీ నుంచి ఎల్ఐసి కాలనీ వరకూ నిర్మిస్తున్న సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రేనేజీ పనులకు కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ శంకుస్థాపన చేశారు. పనులు వేగంగా పూర్తి చేసి త్వరగా కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకంటోన్మెంట్ లోని ప్రతి వార్డులోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కంటోన్మెంట్‌ను సమస్యలే లేని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ సురేఖ, వార్డు అధ్యక్షులు సత్యనారాయణ, వార్డ్ ఇంఛార్జ్ శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు బద్రీనాద్ యాదవ్, అశోక్, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఇన్‌స్పెక్టర్‌కు నేతల అభినందనలు


ఇన్‌స్పెక్టర్‌ను అభినందిస్తున్న నేతలు

**కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్తః** మోండా మార్కెట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ భాద్యతలు చేపట్టిన రాంచంద్రను ఎండీ ఆశ్రఫ్‌బాయ్, అజ్జు, నజీర్, దర్గారవికుమార్‌లు కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఆయనను సన్మానించారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో తలసాని


బల్కంపేట ఎస్.ఆర్.నగర్‌లోని శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డి నగర్,మే 3 ప్రభాతవార్త:** బల్కంపేట ఎస్.ఆర్.నగర్‌లోని శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 30వ వార్షిక బ్రహ్మోత్సవాలకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు, ప్రధాన అర్చకులు,చైర్మన్ బొడ్డుకుమార్ గౌడ్‌లు తలసానికి శాలువాలతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. వారితో పాటు బిఆర్ఎస్ పార్టీ అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంతరావ్, సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, బొద్దు శ్రావణ్ కుమార్ గౌడ్, కూతురు నరసింహ, వనం శ్రీనివాస్, దాడి ప్రవీణ్ రెడ్డి హరిసింగ్, జాదవ్, నరేందర్ రెడ్డి, కట్ట బలరాం, గుడిగే శ్రీనివాస్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం..


పాలాభిషేకం చేస్తున్న కేశవ్ యాదవ్

**పేట్ బషీరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సూరారం డివిజన్‌లోని షాపూర్ నగర్ మార్కెట్‌లో డివిజన్ అధ్యక్షుడు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కులగణనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ అధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, భాను చందర్, తిరుపతిదాస్, జైవంత్, నరసింహ, జోగిని రాజు, బల్రామ్, రాజేష్ జైన్, సందీప్, ఈశ్వర్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ..


లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, మే 3, ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ పరిధిలోని పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 60,000 ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని శనివారం కొలన్ హనుమంత్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం..


మాజీ మేయర్ దంపతులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

**నిజాంపేట్, మే 3, ప్రభాతవార్త** 12వ డివిజన్ సీనియర్ నాయకులు, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం కమిటీ సభ్యులు శనివారం మాజజీ మేయర్, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థాన ఆలయ చైర్మన్ కొలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2లో ఈనెల 9 నుండి 12 వరకు నిర్వహించే శ్రీశ్రీశ్రీ పంచముఖ ఆంజనేయస్వామి స్వామి వారి దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవము, శ్రీ లక్ష్మీ గణపతి ప్రతిష్ఠా మహోత్సవం, శివాలయ శంకుస్థాపన వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరు కాగలరని ఆహ్వాన పత్రికను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, సభ్యులు నాయకులు వెంకటేష్, బట్ట మురళీ, గాలి శ్రీనివాస్, లడ్డూ, గోల్కొండ శ్రీను, చంద్రమౌళి, మల్లేష్ యాదవ్, ఇతర ముఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హైదర్షాకోట్‌లోని కస్తూర్బాగాంధీ ట్రస్టులో నివసిస్తున్న వృద్ధులతో వసతుల కల్పనపై మాట్లాడుతున్న డిడబ్ల్యుఒ శ్రీలత, సిడిపిఒ కవిత, స్వాతి, పద్మ తదితరుల దృశ్యం

## పేదల ఆకలి తీరాలంటే తినే బియ్యం నాణ్యంగా ఉండాలి

**-కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి.**


ప్రకాశంనగర్‌లో పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న బండి రమేష్.

**బేగంపేట మే 3.ప్రభాతవార్త :** పేద ఆకలి తీరాలంటే మొదట తినే బియ్యం నాణ్యంగా ఉండాలని, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ ప్రకాశం నగర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విశాల్ సుధాం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో బండి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన పదేళ్ల పాలనలో పేదలకు దొడ్డు బియ్యం అందించారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నాణ్యమైన సన్నబియ్యాన్ని పేదలకు అందిస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు చేయూత వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుండటాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని, ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ప్రజలు వారిని పదేళ్ల నమ్మి మోసపోయామని గుర్తించారని, ఇక భవిష్యత్‌లో బీఆర్ఎస్ కు అధికారం కలేనని ఆయన అన్నారు. మరో సారి కూడా రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమల్లోకి తీసుకు వస్తుందని బండి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజీ టోచర్, గౌరపల్లి రమేష్, నర్సింగరావు, అరుణ్‌గౌడ్, మోహిత్, శేఖర్, పర్వేజ్, గణేష్, అలీ. నిర్మల, సరోజా, ఆరిఫ్, బాలా. ఇమ్తియాజ్, మున్నావర్, సజీద్, రాఘవ, చిరంజీవి, హనీఫ్, జగదీష్, కృష్ణ, బబ్లూ, బుష్రా, భీమ్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణజోన్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్ రన్నరప్‌గా వివేక్ సింగ్



దక్షిణజోన్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్ రన్నరప్ వివేక్‌సింగ్‌ను అభినందిస్తున్న టెన్‌పిన్ బౌలింగ్ ఫెడరేషన్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ అజయ్‌సింగ్, చిత్రంలో విజయకృష్ణ దాసరి ఉన్నారు.

**హైదరాబాద్, మే 3 ప్రభాతవార్త** దక్షిణ జోన్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్‌లో కర్ణాటకకు చెందిన కిషన్.ఆర్, హితాషా సిసోడియా విజేతలుగా నిలవగా.. తెలంగాణ రాష్ట్రం నుండి హైదరాబాద్‌కు చెందిన యువకుడు వి.ఎస్.వివేక్ సింగ్ రన్నరప్‌గా నిలిచాడని తెలంగాణ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బెంగళూరులోని అమీబా బౌలింగ్ సెంటర్‌లో ఏప్రిల్ 28 నుంచి మే 1వ తేదీ వరకు జరిగిన ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో ఫైనల్‌లో కిషన్.ఆర్ (కర్ణాటక) మొదటి స్థానంలో ఉన్న వివేక్ సింగ్ (తెలంగాణ)పై తలపడి ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 5 పిన్స్ తేడాతో విజయం సాధించాడని తెలిపారు. రెండు గేమ్‌ల మొత్తం స్కోరు ఆధారంగా నిర్ణయించిన ఈ పోరులో మొదటి గేములో కిషన్ 179 స్కోరు చేసి వివేక్ (159)పై 20 పాయింట్ల ఆధిక్యం సాధించాడని పేర్కొన్నారు. రెండో గేమ్‌లో వివేక్ సింగ్ 189, కిషన్ 174 స్కోరుతో టైటిల్ గెల్చుకున్నాడని వెల్లడించారు. ముందు జరిగిన స్టెప్‌లాడర్ రౌండ్‌లో భాగంగా.. మ్యాచ్ 1లో 5వ సీడ్ పర్వేజ్ అహ్మద్ (కర్ణాటక) 364 స్కోరుతో, లలిత్ కుమార్ (తెలంగాణ 327) మరియు ఈశ్వర్‌రావు (కర్ణాటక 324)పై విజయం సాధించాడని తెలిపారు. అలాగే మ్యాచ్ 2లో భాగంగా 4వ సీడ్ నవీన్ సిద్ధాం (తెలంగాణ) 395 స్కోరుతో విజయ్ పంజాబీ (కర్ణాటక 303), అబ్దుల్ ముజీబ్ (ఏపీ 365)పై గెలిచాడని అన్నారు. అదేవిధంగా సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో కిషన్.ఆర్ (394) నవీన్ సిద్ధాం (340), పర్వేజ్ అహ్మద్ (366)పై గెలిచి ఫైనల్‌కు ప్రవేశించాడని తెలిపారు. అలాగే మహిళల విభాగంలో ఫైనల్‌లో హితాషా సిసోడియా (కర్ణాటక) అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్ గెలుచుకుందన్నారు. పురుషుల విభాగానికి సంబంధించి (6 గేముల సగటు స్కోరు) వివేక్ సింగ్ (తెలంగాణ)196.7, పురుషులు (18 గేముల సగటు) వివేక్ సింగ్ 189.1, మహిళలు (12 గేముల సగటు) హితాషా సిసోడియా 167.4 సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కర్ణాటక స్టేట్ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.కన్నన్, టెన్‌పిన్ బౌలింగ్ ఫెడరేషన్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ అజయ్ సింగ్ అభినందించారు.

## కులగణనపై ప్రధానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి

**-బిసి సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్**


సమావేశంలో మాట్లాడుతున్న నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్ తదితరులు

**హైదరాబాద్,మే 3,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని దీనికి దేశంలోని అన్నిరాజకీయ పార్టీలు మద్దతివ్వాలని బిసి సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో 12బిసి సంఘాలతో సమావేశమైన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈసందర్భంగా నీలవెంకటేష్ మాట్లాడుతూ ప్రతిపక్ష కాంగ్రెస్ అధికారంలో ఉన్న 60 సంవత్సరాలు కాలంలో ఏం చేయకుండా ఇప్పుడు అధికారం కోల్పోయాక మాఘనతన్ని చెప్పడాన్ని తప్పుపట్టాడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని మంత్రివర్గంలో రెండు పదవులు ఇచ్చి బీసీలకు అన్యాయం చేశారన్నారు. కార్పొరేషన్ చైర్మన్‌లల్లో 20 శాతం పదవులు కూడా బిసిలకు ఇవ్వలేదన్నారు. అలాగే సమాచార కమిషనర్ ఏడుగురు నియమిస్తే బీసీలు ఒక్కరే దొరికారా? ఇదా నీబీసీ అంకితభావం అని ప్రశ్నించారు. బిసి సంక్షేమ సంఘం ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో గత 30 సంవత్సరాలుగా చేస్తున్న చేస్తున్న ఉద్యమ ఫలించిందని గత 30 సంవత్సరాల కాలంలో 160 సార్లు ఢిల్లీలో వందల సార్లు హైదరాబాద్ లో ఉద్యమాలు, సభలు పెట్టమన్నామని ఈ ఘనత కృష్ణయ్యకే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో బిసి ఐవ్యవేదిక అధ్యక్షులు అనంతయ్య సి. రాజేందం, మోడీ రాందేవ్, మణికంఠ రాజు నేత,మధుసూదన్, నర్సింగ గౌడ్, నిరంజన్, వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని సమస్యలపై వెస్ట్‌జోన్ కమిషనర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేత రవీందర్


వెస్ట్‌జోన్ కమిషనర్ హేమంత్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత రవీందర్‌యాదవ్

**శేరిలింగంపల్లి, మే3ప్రభాతవార్త** శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ నూతన కమిషనర్ హేమంత్‌తో బీఆర్ఎస్ సీనియర్ నేత రవీందర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించటంతో ఆయనను రవీందర్ యాదవ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని పలు సమస్యలను వెస్ట్‌జోన్ కమిషనర్‌కు వివరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను కమిషనర్‌కు రవీందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి కమిషనర్‌గా హేమంత్ రావటంతో అభివృద్ధి వేగంగా సాగుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా సమావేశంలో డివిజన్లలో చేపట్టాల్సిన పనులను, ప్రజలకు ఉన్న సమస్యల ను వివరించారు. వాటిపై త్వర లోనే అధికారులతో నే సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారని రవీందర్ యాదవ్ వెల్లడించారు.

## విజయ్ దేవరకొండ క్షమాపణ చెప్పాలి

**సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త:** సినిమా హీరో సూర్య నటించిన 'రెట్రో' సినిమా ఆడియో విడుదల సందర్భంగా హాజరైన హీరో విజ య్ దేవరకొండ గిరిజనులపై చేసిన వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని నవోదయ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ పటేల్ డిమాండ్ చేశారు. ఆ సినిమాలో గిరిజనులను ఉద్దేశించి విజయ దేవరకొండ మాట్లాడుతూ 500 సంవత్సరాల క్రితం వారు బుద్ది లేకుండా, మినిమం కామన్‌సెన్స్ లేకుండా కొట్టుకున్నారని ఆరోపించారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతి బిడ్డలను పాకిస్తాన్ ఉగ్రవాదులతో పోల్చి, గిరిజనుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆయన వా ఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

## మణికొండలో వాసవీమాత ఆలయానికి వెయ్యి గజాల స్థలం ఇస్తాం

**- రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి**


మణికొండలో జరిగిన ఆర్యవైశ్య ఆఫీసర్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి.

**నార్సింగి, మే 3 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మణికొండలో వెయ్యి గజాల స్థలంను వాసవీ మాత ఆలయం కోసం కేటాయిస్తామని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి కార్తిక్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మణికొండలో ఆర్యవైశ్య ఆఫీసర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు శ్రీధర్, మహిళా అధ్యక్షురాలిగా స్రవంతిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కార్తిక్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి బిఆర్ఎస్ పార్టీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ సర్కారు ఆర్యవైశ్యులను అన్ని రకాలుగా ఆదుకుందని, వారి న్యాయమైన డిమాండ్లను తీర్చిందని వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఖచ్చితంగా మళ్లీ బిఆర్ఎస్ సర్కారు వస్తుందని, మూడోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని కార్తిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల రాష్ట్ర ప్రజలు విసిగి పోయారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 6.గ్యారెంటీలు, 420.హామీలు అమలు చేయలేక చేతులెత్తేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, మలిపెద్ద శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 10 నుండి స్కై వాచ్ అంతరిక్ష పరిశోధనల్లో ఆసక్తి పెంచేలా క్యాంపు

**హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త:** విద్యార్థుల్లో అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందేలా, వారి భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల్లో ఆసక్తిని పెంచేలా విద్యార్థులకు స్పేస్ సైన్స్ సమ్మర్ క్యాంపు ను ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు కొక్కొండ పృథ్విపతి రావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్ట్రానమీ అంశాలతో పాటు స్పేస్ ఫొటోగ్రఫీపై కాంపిటేషన్లు, వర్చువల్ రియాలిటీ అంశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించడం నుండి,నైపుణ్యం పెంపొందించే విధంగా ఏడు రోజుల పాటు పలువురు సైంటిస్టు, ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహిస్తున్నట్లు, ఈ క్యాంపు పట్ల ఆసక్తి గల ఐదవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు విద్యార్థులు ముందుగా సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
నిట్ సం.02/EE-Div.29/SBZ/GHMC/2025-26, తేది: 02.05.2025. పని పేరు: GHMC, SBZ, సర్కిల్-29, సికింద్రాబాద్‌లో హైదరాబాద్‌లో MW ఉత్సవ కార్యక్రమం యొక్క 72వ ఎడిషన్ దృష్ట్యా మెయిన్ రోడ్ విస్తరింపు కొరకు లేన్ మార్కింగ్, కెర్బ్ పెయింటింగ్, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు. అంచనా మొత్తం/ECV లక్షలలో: 19.60. బిడ్ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 05.05.2025 ఉ.10.30 గం. నుండి 08.05.2025 ఉ.10.30 గం. వరకు. అధికారి పేరు: చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Div-29, GHMC, సికింద్రాబాద్. సెల్ నం.7995468066. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, Div-29, సికింద్రాబాద్, GHMC
DIPR.No.1290-PP/CL/Advt/1/2025-26, తేది: 03.05.2025

## ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : బాబు శ్రీనివాస్



లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని అందజేస్తున్న బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్ తదితరులు

**మలక్ పేట ,మే 3, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, గ్రేటర్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, మలక్ పేట కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ఆకుల రాజులు పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట డివిజన్ లోని పలు ప్రాంతాలలోని రేషన్ షాప్ ల వద్ద లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేందర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడిని ఖండిస్తున్నాం: చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ



ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించి మౌనం పాటిస్తున్న చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు తదితరులు

**మలక్ పేట ,మే 3, ప్రభాతవార్త:** ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ లు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లో జరిగి నహైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం లో కాశ్మీర్ పెహల్ గావ్ లో ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకార్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## ఘనంగా ఏఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరణలో ఏఐవైఎఫ్ నాయకులు.

**హయత్‌నగర్, మే 3 ప్రభాతవార్త :** అఖిల భారత యువజన సమైక్య 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని హయత్‌నగర్ మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు వీరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మర్రి శోభన్ ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన సిపిఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి కామ్రేడ్ శేషరాజుపల్లి శ్రీదేవి మాట్లాడుతూ నేటి యువత దేశ సమగ్రత పరిరక్షణకు, మతతత్వ విద్వేషాల నిర్మూలనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం నిబద్ధతతో పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రజా పోరాటాల్లో ఏఐవైఎఫ్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. ప్రస్తుత పాలకులు యువతను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని, ఇది దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించు కునేందుకు యువత బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలనన్నారు. కార్యక్రమంలో హయత్ నగర్ మండల మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సరిత, సుజాత నాయకులు వెంకట్, గంగరాజు, పరశురాం యాకన్న, అశోక్, గణేష్ పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు: అబ్రార్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఐఎం నాయకులు అబ్రార్ తదితరులు

**మలక్ పేట ,మే 3 ప్రభాతవార్త:** అజంపుర డివిజన్‌లో వేగంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షులు అబ్రార్ పేర్కొన్నారు. డివిజన్ లోని అజంపుర లో నూతనంగా చేపడుతున్న అభివృద్ధి పనులను జిహెచ్‌ఎంసి ఏఈ మల్లికార్జున్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వివరించారు.

## మంత్రి శ్రీధర్ బాబును కలసిన కొసరాజు లక్ష్మణ్, వెంకట్ రమణ రెడ్డి



**నేరెడ్ మెట్, మే 3.ప్రభాతవార్త :**
నూతనంగా నియమితులైన బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సలహాదారుడు కోసరాజు లక్ష్మణ్, బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ మీడియా కో ఆర్డినేటర్ వెంకట రమణా రెడ్డిలు శనివారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, తెలంగాణ బ్యాట్ అధ్యక్షులు దుద్దిల్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వారికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాట్మింటన్ క్రీడాభివృద్ధికి మరింత కృషి చేస్తామని, క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు స్పోర్ట్స్ అకాడమీ లను క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఘట్టి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధితో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీకి తన వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బ్యాట్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఈవెంట్స్ అండ్ ప్రోటోకాల్ యువిఎన్ బాబు తదితరులు ఉన్నారు.

## రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**నేరెడ్ మెట్, మే3,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి డివిజన్ ఆర్కే నగర్ లో నూతనంగా నిర్మిస్తున్న దయానందనగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను రైల్వే ఉన్నతాధికారులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఆర్కే నగర్ కాలనీవాసుల విన్నపం మేరకు ఆర్కే నగర్ రైల్వే స్టేషన్గా నామకరణం చేయాలని అదేవిధంగా రైల్వే స్టేషన్ నుండి ఆర్కే నగర్ స్ట్రీట్ నెంబర్ 1,2 నుండి బయట కు వెళ్లేందుకు ఒకే మార్గాన్ని ఇవ్వడంతో రోడ్లు ఇరుకుగా ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని రెండు (ఎగ్జిట్) బయటకు వెళ్లే మార్గాలను ఇవ్వాలని కోరారు.ఆర్కే నగర్ రైల్వే స్టేషన్ కి వెళ్లే మార్గంలో గల బిల్డింగ్ పై విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండడంతో రైల్వే అధికారులు ఎమ్మెల్యే తెలియజేయగా వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి పరిష్కరింప చేస్తానని తెలిపారు.రైల్వే ఉన్నతాధికారులు రైల్వే స్టేషన్ ఆర్.కె.నగర్ గా పేరు మార్పుకు, రైల్వే స్టేషన్ నుండి బయటకు వెళ్లే మార్గాలు రెండు గేట్లు పెట్టేందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్కే నగర్ కాలనీ వాసులకు కోరిక మేరకు 1976 లో రైల్వే జనరల్ మేనేజర్ కె. ఎస్. రాజన్ ప్రారంభించిన నేషనల్ హైస్కూల్లో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ శ్రేణి సాధించిన విద్యార్థులను శాలువాలతో



సత్కరించి వారిని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందించినారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఏడిఆర్ఎం రెహమాన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుద్ పవర్, శశాంక్ నామ్దేవ్, అరుణ్ శర్మ, కమర్షియల్ ఇన్స్పెక్టర్ లు సురేష్ ,పవన్, నాగలింగబాబు, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు సతీష్, శ్రీకాంత్, నవీన్, బంటి, గోపాల్ సింగ్, లక్ష్మణ్ , మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, వంశీ, రాజశేఖర్ రెడ్డి హేమంత్ పటేల్ , ఆర్కే నగర్ కాలనీవాసులు సోమశేఖర్ రాఘవేంద్ర కెవివి ఎస్ఎస్ గుప్తా రవికిరణ్ సాయినాథ్ శివకుమార్ శ్యామ్ సుందర్ రైల్వే అధికారులు, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటమే: విరహత్ అలీ

**ఎల్‌బీనగర్, మే 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలోనే అతి పెద్ద జర్నలిస్టుల సంఘంగా టీయూడబ్ల్యూజే నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాడుతామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే-ఐజేయు) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే-ఐజేయు ప్రథమ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు ఎండి.సలీమ్ పాషా అధ్యక్షతన ఎల్ బీ నగర్ లో శనివారం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డితో కలిసి విరహత్ అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలన్నీ తమ సంఘం సాధించినవేనని, గత పదేళ్ల కాలంలో జర్నలిస్టులకు ఆశించిన ప్రయోజనాలేమి లేవన్నారు. పవిత్రమైన జర్నలిజం వృత్తిని అవిత్రం చేసే శక్తులకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అక్రిడేషన్ కార్డులు మరోసారి పొడిగింపు ఉండదని, జూన్ నెలలో ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విలువలతో కూడిన జర్నలిజాన్ని తమ సంఘం ప్రోత్సహిస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలో జిల్లా ఇంచార్జ్ మంత్రి,అధికార,ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా మాట్లాడుతూ జిల్లాలో గత పదేళ్లుగా 5 లక్షల ప్రత్యేక భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జర్నలిస్టులకు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సత్యనారాయణ, శ్రీశైలం, కిషన్, ప్రవీణ్‌కుమార్, కటకం సుభాష్,ఆవంచ సురేందర్, భాస్కర్, దుపమ్ ప్రసాద్, శశి పాల్ రెడ్డి, మధు కుమార్, షకీల్, ప్రణయ్ ముదిరాజ్, నరసింహా రావు, శేఖర్, ఆంజనేయులు, కృష్ణ, కరుణాకర్, పాండు యాదవ్, రఘు యాదవ్, దర్శనం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాహత్ అలీని సన్మానిస్తున్న శ్రీకాంత్ రెడ్డి, సలీం పాషా

## మా పార్టీ ఎంపి ఈటెలను అవమానిస్తే సహించేది లేదు : బిజెపి

**వనస్థలిపురం. మే.3.ప్రభాతవార్త :**
మే 1.న యన్.జి.వోస్ కాలనీలొ గ్రంథాలయ భవన నిర్మాణ శిలాఫలకం లో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ పేరు ప్రోటోకాల్ ప్రకారం పెట్టకుండా ,చిన్న అక్షరాలతో ఎమ్మెల్యే తర్వాత పెట్టడం ఎంతవరకు సమంజసమని బి.జె.పి.డివిజన్ అధ్యక్షుడు కొంతం నవాకిశోర్ రెడ్డి ప్రశ్నించారు. శ్రీ కన్వెన్షన్ లో శనివారం బి.జె.పి. నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్యెల్యే సుదీర్ రెడ్డి తన అనుచరులతో బి.జె.పి నాయకుల పై వ్యక్తి గత విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. శిలాఫలకాలు ద్వంసం చేసే సంస్కృతి బి.ఆర్. ఎస్. నాయకులదేనన్నారు.2023 లో మన్సూరాబాద్ డివిజన్ లో షటిల్ కోర్టు ప్రారంభ సమయంలో ఎమ్యెల్యే పేరు లేదని, శిలాఫలకాన్ని ద్వంసం చేసిన విషయం బి.ఆర్.ఎస్.నాయకులు మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు. అదేవిధంగా సచివాలయ నగర్ లో స్విమ్మింగ్ పూల్ ప్రారంభ సమయంలో ఏ హోదా తో శిలాఫలకం పై కటికరెడ్డి అరవింద్ రెడ్డి పేరు పెట్టారని ప్రశ్నించారు. దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు గా మల్కాజిగిరి కి ఎం. పి.గా ఉన్న ఈటెల రాజేందర్ ను అవమానిస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయకులు విష్ణువర్ధన్ రావు,శంకర్ గౌడ్,శ్రీధర్ రావు,జైపాల్ రెడ్డి, సుధీర్ ,కిషోర్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నవకిషోర్ రెడ్డి తదితరులు.

## రూ.27 కోట్లతో నల్ల చెరువు అభివృద్ధి పనులు : రజితరెడ్డి

**ఉప్పల్, మే 3 ప్రభాతవార్త :** ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధికి ప్రభుత్వం రూ.27 నిధులు మంజూరు చేసినట్లు ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డితోపాటు పలువురు అధికారులతో కలిసి నల్ల చెరువును సందర్శించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నల్ల చెరువు సుందరీకరణ కోసం ప్రభుత్వం రూ.27 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. నల్ల చెరువు కబ్జాలను తొలగించడంతోపాటు, కలుషిత జలాలు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.చెరువు పరిస్థితిని సిఎం రేవంత్‌రెడ్డికి వివరించడంతో స్పందించి సుందరీకరణ కోసం నిధులు మంజూరు చేశారని తెలిపారు. మొదటి విడతలో చెరువలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందుకు రూ.9.9 కోట్లు విడుదల అయినట్లు తెలిపారు. ఈ నిధులతో చెరువులోకి వచ్చే మురుగునీటిని దారి మళ్లించి స్వచ్ఛమైన నీరు చెరువులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెరువులో పూడికతీయడంతోపాటు, ఎఫ్‌టిఎల్‌ను రక్షించి తూము ఏర్పాటు చేస్తామని తెలిపారు. చెరువు పనులు యుద్ధ ప్రాతిపధికన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా డిఇ నాగరాజు, ఎఇ సత్యబాబు, తహసీల్దార్ యూనిస్, కాంగ్రెస్ పార్టీ నేతలు బాకారం లక్ష్మణ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, అలుగుల అనిల్‌కుమార్, బి.రత్నం, విజయలక్ష్మి, మోహన్‌నాయక్, నాగునాయక్, నాగూర్‌బాషా, విజయ్, సత్తి, సత్యనారాయణ, ప్రశాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రసూల్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

## మీర్‌పేట్ మంత్రాల చెరువు సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలి

### -అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



మంత్రాల చెరువును పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** సుందరీకరణ జరుగుతున్న మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మంత్రాల చెరువుకు సంబంధించిన సమస్యలను పదిహేను రోజుల్లో పరిష్కరించాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి కార్పొరేషన్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిఇఇ వెంకన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా పాదయాత్రలు చేస్తూ చెరువు చుట్టూ తిరిగిన ఆమె అక్కడి సమస్యలను పరిశీలించారు. చెరువుకు సంబంధించిన ఫెన్సింగ్ ధ్వంసం అయి ఉండడం, అక్కడి వీధి దీపాలు పని చేయకపోవడం, చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయి ఉండడం తదితర సమస్యలను గమనించారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందిస్తూ వచ్చే 15 రోజుల్లోపు ఆయా సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవి కారణంగా చెరువులో కొంత భాగం ఎండిపోయినందున పూడికతీత పనులు చేపట్టాలని సబితారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, దీప్‌లాల్ చౌహాన్, బొక్క రాజేందర్‌రెడ్డి, ఎనుగుల అనిల్ యాదవ్, ఎం.ఎ.రజాక్, అర్కల కామేష్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, జె.శ్రీనివాస్ నాయక్, సిద్దాల అంజయ్య, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దయానంద్ ముదిరాజ్, పాలవర్తి విజయలక్ష్మి , జమాల్‌పూర్ సునీత బాలరాజ్, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, తుమ్మల నిర్మలారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ : కెఎల్ఆర్



లబ్ధిదారురాలికి చెక్కును అందజేస్తున్న కెఎల్ఆర్: చిత్రంలో పోరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్ అని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జిల్లెలగూడ వివేక్‌నగర్ కాలనీకి చెందిన ఎస్.రాణికి మంజూరైన రూ.60 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ముఖ్యమంత్రి సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించడానికి సహకరిస్తామని తెలిపారు. కాగా తమకు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించిన కెఎల్ఆర్‌కు, సహకరించిన మాజీ కార్పొరేటర్ పోరెడ్డి పద్మా భాస్కర్‌రెడ్డికి లబ్ధిదారురాలైన రాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏనుగు జంగారెడ్డి, మర్రి హన్మంత్‌రెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాలలో నాగార్జున విద్యాసంస్థల ప్రభంజనం




పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు.

**వనస్థలిపురం మే.3,ప్రభాతవార్త :**
పదవ తరగతి పరీక్షా ఫలితాల లో వనస్థలిపురం లోని నాగార్జున విద్యా సంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విట్టల్ రెడ్డి తెలిపారు. ఇద్దరు విద్యార్థులు 587 మార్కులు, 13మంది 580 మార్కులు సాధించగా189 మంది 540 మార్కుల తో 90 శాతం మార్కులు సాధించారన్నారు.పాటు ఏటా తమ పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో రికార్డ్ స్థాయిలో విజయం సాధించారన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూల బొకే లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రజని విట్టల్ రెడ్డి, అకడమిక్ డీన్ రాజశేఖర్ సి.ఈ.ఓ. శేషారావు, ప్రిన్సిపాల్ విజయకుమార్,రమేష్,రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిల రక్షణకు అట్రాసిటీ చట్టం తేవాలి

### -బీసీ జన సైన్యం రాష్ట్ర ఉపాధ్యక్షులు చర్లపల్లి మనోజ్

**నేరేడ్‌మెట్, మే 3.ప్రభాతవార్త :** ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ కల్పించడానికి చట్టం తీసుకురావాలని బీసీ జన సైన్యం రాష్ట్ర ఉపాధ్యక్షులు చర్లపల్లి మనోజ్ కోరారు. రాష్ట్రంలో బీసీ కులాల వారిపై జరుగుతున్న దాడులు నిరోధానికి అట్రాసిటీ బిల్లు పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి ని బిఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలతో పాటు అందరూ పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం పరశురాం రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సూరి, బాల కృష్ణ, మల్లేష్, ఉమేష్,ఇస్మాయిల్ సాయిబాబా అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ లచ్చిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలి



కార్పొరేటర్ లచ్చిరెడ్డిని అరెస్ట్ చేయాలని ఏ.సి.పి.కి వినతిపత్రం అందజేస్తున్న బి.ఆర్.ఎస్.నాయకులు.

**వనస్థలిపురం. మే.3.ప్రభాతవార్త**
వనస్థలిపురం యన్.జి.వోస్ కాలనీలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి సంబంధించిన ప్రభుత్వ శిలాఫలకాన్ని పగులగొట్టిన బి.యన్.రెడ్డి.నగర్ ,చంపాపేట డివిజన్ల కార్పొరేటర్ లు మొద్దు లచ్చిరెడ్డి, వంగా మధుసూదన్ రెడ్డి ,బి.జె.పి.అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి లను వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేస్తూ బి.యన్.రెడ్డి.నగర్ బి.ఆర్.ఎస్.అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వనస్థలిపురం ఏ.సి. పి.కాసిరెడ్డి, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ లకు వినతిపత్రం అందజేశారు. మే.1న గ్రంథాలయ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన అనంతరం తిరిగి అదేరోజు సాయంత్రం బి.జె.పి.నాయకులు తమ అనుచరులతో వచ్చి ,రాజ్యాంగ విరుద్ధంగా శిలాఫలకాన్ని పగులగొట్టారని, ఈ చర్య సభ్యసమాజానికే సిగ్గుచేటన్నారు. వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వనస్థలిపురం బి.ఆర్.ఎస్.అధ్యక్షుడు చింతల రవికుమార్,లగ్గోని శ్రీధర్ గౌడ్,గంగం శివశంకర్,మునగాల రాఘవేంద్ర రావు, గౌరిశెట్టి మనోజ్,రవి ముదిరాజ్,సతీష్ చౌదరి, గడ్డం మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి శిశుమందిర్‌లో టీచర్ ట్రైనింగ్ క్యాంపు



కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

**సైదాబాద్, మే 3 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ సరస్వతి నగర్‌లోని సరస్వతి శిశు మందిరంలో ఏర్పాటు చేసిన టీచర్ ట్రైనింగ్ క్యాంపుకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 20 రోజుల పాటు నిర్వహించబడే ఈ క్యాంపులో 95 మంది ప్రశిక్షార్థులు, 20 మంది ప్రబంధకులు, 14 మంది ఆయాలు, పాల్గొంటున్నారు. ఈ ప్రార్థనా సమావేశంలో రాష్ట్ర శిశు వాటిక సంయోజక్ కాటం రవీందర్, శిశు వాటిక ప్రముఖ్ కొత్తపల్లి ఉమ, పాఠశాల కార్యదర్శి దశరథరెడ్డి, పాఠశాల ప్రధానాచార్య శివలీల పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

### -కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



ధ్వంసమైన కమ్యూనిటిహాల్ డోర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 3 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ రెవిన్యూ బోర్డు కాలనీ, వెంకటాద్రినగర్‌లలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. రెవిన్యూ బోర్డు కాలనీ, వెంకటాద్రినగర్‌లలో పర్యటించిన కార్పొరేటర్ స్థానికంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కేబుల్స్ సరిచేయాలని ఎడిఇ వినోద్‌రెడ్డి, ఎఇ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. కమ్యూనిటిహాల్‌కు తగిన మరమ్మత్తు పనులు చేపట్టాలని, తిరుమల హిల్స్ మెట్ల వద్ద నీటి లీకేజి సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీధర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అచ్యుతరామయ్య, పాండు, సత్యనారాయణ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

**ఎల్‌బీనగర్, మే 3 ప్రభాతవార్త:** వందలాదిమంది భక్తుల కోలాహలం మధ్య స్వామి వారి రథోత్సవం ముందుకు సాగింది. దేవాలయం పురవీధుల్లో నిర్వహించిన స్వామివారి రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో జరుగుతున్న 29వ(ఏకోనత్రింషత్) ఇష్టి సహిత బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవ కార్యక్రమం జరిగింది. శనివారం సుదర్శన ఇష్టి, కల్పవృక్ష వాహన సేవ, మహా పూర్ణాహుతి తదితర సేవా కార్యక్రమాలు ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహచార్యుల నేతృత్వంలో జరిగాయి. బ్రహ్మోత్సవాలలో తెలంగాణ రాష్ట్ర మహిళా చైర్ పర్సన్ నేరెళ్ల శారద, మార్కెట్ కమిటీ ఉద్యోగ సంఘాల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నరసింహా రెడ్డి హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, దాచేపల్లి శ్రీనివాసు, గౌరిశెట్టి అరుణ్ కుమార్, చిలుక ఉపేందర్ రెడ్డి, ఉమాపతిరావు, సుదర్శన్, గ్రంధి రమేష్, మాలే శ్రీనివాస్, సత్యనారాయణ, మాలే శ్రవణ్, తమన్నా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి కోట తగ్గించడానికి కాంగ్రెస్ కుట్ర:బిజెపి



మోడీ కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న కార్పొరేటర్

**ఎల్‌బీనగర్, మే 3 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోదీ కులగణనపై చరిత్రాత్మక నిర్ణయానికి స్వాగతం పలుకుతూ ఎల్ బి నగర్ చౌరస్తాలో గీతా సెల్ నాయకుడు బి.యశ్వాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. 75 యేండ్ల స్వాతంత్ర్యం తరువాత కులగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తూ మోడీ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణలో ఏవిదంగా కుల గణన జరిగిందో దేశమంతా అదే మాదిరిగా జరగాలని కాంగ్రెస్ పార్టీ కోరుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిసి కోటలో ముస్లింలను చేర్చడం అంటే బీసీ కోట తగ్గించడమే కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. బంగ్లాదేశ్, పాకిస్తాన్ ముస్లిములకు రిజర్వేషన్ కల్పిస్తారా అని కాంగ్రెస్ పార్టీనీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నరసింహా రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేందర్‌రెడ్డి. బీజేపీ నాయకులు బొంగు రఘుగౌడ్, ప్రవీణ్ గౌడ్, ముదగోని శేఖర్ గౌడ్, సుమన్ గౌడ్, శేఖర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, పవన్ గౌడ్. శ్రవణ్ గౌడ్ వీరస్వామి గౌడ్, రాములు గౌడ్, అంబాల మల్లేష్ గౌడ్, క్రాంతి గౌడ్, మధుకర్ గౌడ్ లయ గౌడ్, మల్లేష్ గౌడ్, బొడ వెంకటరమణ గౌడ్, నరేష్ గౌడ్ సంప్రిత గౌడ్ , విష్ణు గౌడ్, మల్లికార్జున గౌడ్ పాల్గొన్నారు.

## అర్హులందరికి రుణాలు అందించాలి: వైస్ చైర్మన్ శ్రీనివాస్



ఎమ్మార్వో జయశ్రీతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

**సైదాబాద్, మే 3 ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాస పథకంలో అర్హులందరికి రుణాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సైదాబాద్ మండల తహశీల్దార్ జయశ్రీని కోరారు. శనివారం తహశీల్దార్‌ను కలసిన కోట్ల శ్రీనివాస్ ఇప్పటి వరకు రాజీవ్ యువ వికాసంలో అందిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. మలక్‌పేట, యాకుత్‌పుర నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం జరుగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గనిభాయి, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శశి కుమార్, నగర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట్ల లడ్డు పటేల్, ఐఎస్ సదన్ డివిజన్ ఎస్‌టి సెల్ అధ్యక్షుడు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ కారిడార్ పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి వినతి



ఎలివేటెడ్ కారిడార్ పనులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న బిజెపి నేతలు పణీందర్, ధర్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, మే 3 ప్రభాతవార్త :** ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరగా పూర్తి చేయాలని పలువురు బిజెపి నేతలు శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్న్‌ని పణీందర్, సీనియర్ నేతలు శామీర్‌పేట ధర్మారెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, తీగ విఠల్‌రావు తదితరులు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులు గత నవంబర్‌లో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించారని, పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. కారిడార్ పనుల ఆలస్యం వల్ల దుకాణదారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కాంగ్రెస్ ఎస్సీ విభాగానికి ఉపాధ్యక్షుల నియామకం

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షులుగా మీర్‌పేట్ లెనిన్‌నగర్‌కు చెందని మైత్రి ఆనంద్, జి.నర్సింహులు నియమితుల య్యారు. ఈ మేరకు మీర్‌పేట్ కార్పొరేషన్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మాదరి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యం లో మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్ చేతుల మీదుగా వారు నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు.కార్యక్రమంలో టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఎంపిటిసి పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, సీనియర్ దళిత నాయకుడు బైగళ్ళ ఓం ప్రకాశ్‌తో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాయకులు పాల్గొన్నారు.